

13న జడ్పీ అత్యవసర సమావేశం

నెల్లూరు(జడ్పీ), ఫిబ్రవరి 9: జిల్లా పరిషత్ అత్యవసర సాధారణ సమావేశం ఈనెల 13న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో కన్నమనాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24 సవరణ బడ్జెట్, 2024-25 సంవత్సరపు అంచనా బడ్జెట్‌ను ఆమోదించేందుకు నిర్వహించే ఈ సమావేశం జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని, సభ్యులు, జిల్లా స్థాయి అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.


7 నెల్లూరులో పెన్నా గోడల నిర్మాణం ఎప్పటికో..!?



నారాయణ ఆసుపత్రి ప్రాంగణంలో మోహరించిన పోలీసులు

మాజీ మంత్రి, టీడీపీ సిటీ ఇన్‌చార్జి పొంగూరు నారాయణ నివాసంలో డ్రగ్ కంట్రోల్ అధికారుల తనిఖీలు కలకలం రేపాయి. శుక్రవారం సాయంత్రం 4 నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు తనిఖీలు కొనసాగాయి. అయితే, మందుల కొనుగోలు, అమ్మకాలకు సంబంధించి ఎటువంటి బిల్లులు, మందులు లేవని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంపై టీడీపీ నాయకులు మండిపడుతున్నారు. రాజకీయ కక్షలోభాగంగానే ఈ దాడులు నిర్వహించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ధైర్యంగా ఎదుర్కోలేకనే..



రాజకీయంగా నారాయణను ఎదుర్కోలేక, నారాయణ విద్యాసంస్థలను దెబ్బతీయడానికే ఔషధ నియంత్రణ పేరుతో ఇలాంటి దొంగసోదాలు చేపట్టారు. ఆసుపత్రిలో ఈ తనిఖీలు చేయాల్సి ఉన్నా నివాసంలో సైతం అక్రమంగా తనిఖీలు చేశారు. సోదాల నెపంతో తలుపులు, బీరువాలు పగలగొట్టే సంస్కృతి సరికాదు. నారాయణ ఎన్నికలలో పోటీ చేస్తున్నారన్న ఉద్దేశంతోనే ఇలాంటి సోదాలు చేయడం దారుణం. ఔషధ నియంత్రణ శాఖ అధికారులను అడిగితే వారు నీళ్లు నములుతున్నారు. ఇకనైనా ఇలాంటి చర్యలు మానుకుని నారాయణను ధైర్యంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి.

- విజయభాస్కర్ రెడ్డి, నారాయణ విద్యా సంస్థల జీఎం

'నారాయణ'లో కలకలం

టీడీపీ నేత ఇంట్లో సోదాలు • డ్రగ్ కంట్రోల్ అధికారుల తనిఖీలు • 4 గంటలపాటు హడావుడి

చివరకు ఏమీ లేదంటూ వెనక్కి..! • మండిపడుతున్న టీడీపీ నాయకులు • ఇది రాజకీయ కుట్రేనని ఆగ్రహం

భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది



ప్రభుత్వం నారాయణపై రాజకీయంగా కక్ష సాధింపునకు దిగుతోంది. అందులో భాగంగానే అక్రమ తనిఖీలు చేస్తున్నారు. దీనిని మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఇలాంటి చర్యలకు పాల్పడితే ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. రాబోది టీడీపీ ప్రభుత్వమే. దీనిని దృష్టిలో పెట్టుకొని ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరిస్తున్నాం.

- కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రాజకీయ కక్షలో భాగంగానే..



రాజకీయ కక్షలో భాగంగానే నారాయణ నివాసంలోకి తనిఖీలకు వచ్చారు. మీరెవరని ప్రశ్నిస్తే అప్పుడు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లమని చెప్పారు. తనిఖీలు చేయాల్సింది ఆసుపత్రిలో, మెడికల్ కాలేజీలో అయితే నివాసంలో ఎందుకు తనిఖీలు చేశారు. నెల్లూరులో ఒకటో కృష్ణుడు నరసరావుపేటకు వెళ్లారు. ఇప్పుడు రెండో కృష్ణుడిని దించారు. ఆయన కూడా ఉంటారో లేదో తెలియదు. నారాయణను ఎలాగైనా పోటీ నుంచి దూరం చేయాలని ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది.

- వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, టీడీపీ నాయకుడు

నెల్లూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి/క్రైం/వైద్యం) : డ్రగ్ కంట్రోల్ డీజీ రఘురామిరెడ్డి ఆదేశాలతో శుక్రవారం సాయంత్రం డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ వీరకుమార్, కావలి, నెల్లూరు, గుంటూరుకు చెందిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు వెంకటకృష్ణ, కీర్తి పవిత్ర, విజయభాస్కర్‌తోపాటు ముగ్గురు వీఆర్వోలు నారాయణ ఇంట్లో సోదాలు నిర్వహించారు. వీరికి నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డితోపాటు నగరం రూరల్ పరిధిలోని సీఐలు, స్పెషల్ పార్టీల సిబ్బంది బందోబస్తు కల్పించారు.

చింతారెడ్డిపాలెంలోని నారాయణ ఆసుపత్రి ప్రాంగణం మొత్తాన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముందుగా తనిఖీ అధికారులు నేరుగా ఆసుపత్రి ప్రాంగణంలోని నారాయణ నివాసంలోకి వెళ్లారు. అక్కడ నారాయణ సతీమణి రమాదేవి ఉండగా ఆమెకు తాము అధికారులమని, తనిఖీలకు వచ్చామని చెప్పారు. అయితే ఏ అధికారులు, ఎందుకు తనిఖీలకు వచ్చారన్న విషయాలను మాత్రం చెప్పలేదు. నివాసంలోని అన్ని గదులు, అల్మారాలను పరిశీలించారు. కొన్నింటికి తాళాలు లేకపోవడంతో వాటిని కార్పెంటర్ల ద్వారా పగలగొట్టి తనిఖీ చేశారు. నాలుగు గంటలపాటు తనిఖీ చేసిన అధికారుల బృందం రాత్రి 8 గంటల తర్వాత వెనుదిరిగింది. ఈ సందర్భంగా పంచనామాను తయారు చేసి నారాయణ సతీమణికి అందజేశారు. అందులో నారాయణ మెడికల్ కాలేజీ క్యాంపస్‌లో అనధికారికంగా, నిబంధనలకు విరుద్ధంగా మందుల వ్యాపారం జరుగుతోందన్న సమాచారంతో తనిఖీకి వచ్చినట్లు పేర్కొన్నారు. ముందుగా నారాయణ నివాసంలో తనిఖీలు చేశామని అక్కడ మందుల కొనుగోలు అమ్మకాలకు సంబంధించి ఎటువంటి బిల్లులు, అలానే మందులు లేవని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఆ తర్వాత నివాసానికి ఎదురుగా ఉన్న కార్యాలయంలో కూడా తనిఖీలు చేయగా అక్కడా ఎటువంటి బిల్లులు లేవని గుర్తించామని పంచనామాలో పేర్కొన్నారు. మరి ఎటువంటివి దొరకనప్పుడు ఏ సమాచారంతో అధికారులు తనిఖీలకు వచ్చారన్నదే ఇప్పుడు అసలు ప్రశ్నగా కనిపిస్తోంది.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీస్ బలగాలు

• ఏం జరుగుతుందోనని ఉద్రిక్తత

కాగా నారాయణ నివాసంలో తనిఖీలు చేస్తున్నారన్న విషయం జిల్లాలో కలకలం రేపింది. డ్రగ్ కంట్రోల్ అధికారులతోపాటు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు కూడా పాల్గొన్నట్లు ప్రచారం జరిగింది. దీంతో పెద్ద ఎత్తున టీడీపీ నేతలు ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. వీరిని లోపలకు వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కళాశాల ప్రాంగణం లోపల, బయట ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాగా లోపల తనిఖీలు జరుగుతున్నంతసేపూ ఆసుపత్రిలోకి వెళ్లే ప్రతి ఒక్కరినీ పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. దీంతో వైద్య విద్యార్థులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నిరాహారదీక్ష చేస్తా!

- పోర్టు అధికారులకు రెండు రోజులే గడువు
- ఈలోపు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి
- తేల్చి చెప్పిన కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

కందుకూరు/గుడ్లూరు, ఫిబ్రవరి 9 : రామాయపట్నం పోర్టు నిర్వాసిత గ్రామాల సమస్యలను రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో పరిష్కరించకుంటే నిర్వాసితులతో కలిసి తాను నిరాహార దీక్ష చేస్తానని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి హెచ్చరించారు. రామాయపట్నం పోర్టు నిర్వాసిత గ్రామమైన కర్లపాలెం గ్రామస్థులకు పునరావాస కాలనీ నిర్మాణం కోసం ఇంతవరకు భూ సేకరణ ప్రక్రియ చేపట్టకపోవడం, ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ పోర్టు నిర్మాణ పనులను నిలిపివేసి ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. గురువారం రాత్రి పోర్టు పరిపాలనా కార్యాలయానికి తాళం వేయించి ఆందోళనలో పాల్గొన్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం తిరిగి పోర్టు వద్దకు చేరుకొని ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఒక్కరోజే అధికారులకు గడువు ఇస్తున్నట్లు చెప్పారు. ఆదివారం నుంచి నిర్వాసితులు నిరాహార దీక్ష చేస్తారని, సోమవారం నుంచి తానూ దీక్షలో పాల్గొంటానని ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు కొందరు రాత్రివేళల్లో పోర్టు నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా నిర్మాణ ప్రాంతానికి ఆహారం, మంచినీరు వెళ్లకుండా దిగ్బంధించాలని ఆదేశించారు. నిర్మాణం పనులు కొనసాగించాలంటే అవసరమైన ఆయిల్ ట్యాంకర్లు కూడా వెళ్లకుండా అడ్డగించాలని సూచించారు.



నిర్వాసితులతో కలిసి ఆందోళనలో పాల్గొన్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

• కాంట్రాక్టర్ ప్రతినిధిపై ఆగ్రహం

ఈ సందర్భంగా పోర్టు కాంట్రాక్టర్ ప్రతినిధిని పిలిపించిన ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీ పద్ధతిలో మీరు వెళితే మత్స్యకారుల పద్ధతి ఎలా ఉంటుందో కూడా మీరు చూడాల్సి వస్తుంది.' అంటూ హెచ్చరించారు. మత్స్యకారుల కన్నుగప్పి పనులు చేయాలని చూస్తే లోపల ఉన్న యంత్ర పరికరాలు లాగి బయటపడేయాల్సి వస్తుందని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. నిర్వాసితుల సమస్య పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మూడు గ్రామాల ప్రజలు తిరిగి వారి పాత నివాసాలకు చేరుకొని వారి భూములు వారు దున్నుకుంటారని స్పష్టం చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఆందోళన కొనసాగుతుందని అవసరమైతే ఉద్యమాన్ని మరింత తీవ్రరూపం దాల్చుతామని పేర్కొన్నారు. కాగా, పోర్టు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ఒక బెర్తును సీఎం జగన్‌తో ప్రారంభింపచేయడానికి సన్నాహాలు చేస్తున్న సమయంలో ఈ ఆందోళన ఎంతవరకు సమం జసము అన్న ఓ విలేకరి ప్రశ్నకు ఆయన బదులిస్తూ నిర్వాసితులకు పునరావాసం చూపించకుండా బెర్తులు ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. అయినా ఆ ప్రయత్నం నిర్మాణ కాంట్రాక్టర్లు చేస్తున్నారేకానీ సీఎం ఎక్కడా చెప్పలేదన్నారు. బెర్తు ప్రారంభించాలంటే కస్టమ్స్ అధికారులు క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంటుందని నిర్వాసితుల సమస్య ఉండగా కస్టమ్స్ క్లియరెన్స్ రాదని ఆ విషయం కూడా పోర్టు అథారిటీ అధికారులకు తెలియదా అని ప్రశ్నించారు. ఈ ఆందోళనలో గుడ్లూరు ఎంపీపీ పులి రమేష్, నిర్వాసిత గ్రామాల పెద్దలు చేపల రమణయ్య, మీరయ్య తదితరులు పాల్గొన్నారు.

• తొలిగా లక్ష ఇప్పిస్తాం

- సబ్‌కలెక్టర్, పోర్టు ఎండీ



కాగా, ఉదయం దర్నా జరుగుతున్న శిబిరం వద్దకు కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి, పోర్టు ఎండీ ఐవీ రెడ్డిలు చేరుకుని నిర్వాసితులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన పరిహారంలో తొలివిడతగా ఒక్కో కుటుంబానికి రూ.లక్ష ఇస్తామని చెప్పి ఆందోళన విరమించాలని కోరారు. అందుకు స్పందించిన మత్స్యకారులు ప్యాకేజీ రూ.9.91 లక్షలకు మూడు రెట్లు కలిపి పరిహారం ఇస్తేనే ఆందోళన విరమిస్తామని తేల్చి చెప్పారు. తమ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం దిగి వచ్చే వరకూ ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ ఆందోళనలో సీఐటీయూ జిల్లా నాయకులు జీవీబీ కుమార్, గంటెనపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పోర్టులో పనులు నిలిపివేసి డ్రెడ్జింగ్ మిషన్లను సముద్రంలో లంగర్ వేసిన దృశ్యం



నెల్లూరులో శివలింగంపై ఉప్పు, మిరియాలు పోస్తున్న భక్తులు

వైభవంగా త్రై అమావాస్య

• వైద్య వీరరాఘవస్వామి సన్నిధిలో భక్తుల రద్దీ

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 9 : నగరంలోని క్రాంతినగర్ వేమాలశెట్టిబావి వైద్య వీరరాఘవ స్వామి ఆలయంలో త్రై అమావాస్య తిరునాళ్ల వైభవంగా జరిగింది. ఉదయం 8గంటలకే స్వామివారి దర్శనం కోసం తెలుగు, తమిళ భక్తులు బారులుతీరారు. ఈ సందర్భంగా స్వామికి అభిషేకాలు, విశేష పూజలు, పూలంగిసేవతోపాటు ఉప ఆలయాల్లో ఉత్సవర్లకు విశేష అలంకారాలు జరిగాయి. శివలింగంపై మిరియాలు, ఉప్పు పోసి పూజలు చేశారు. అనంతరం వేమాలశెట్టి బావిలో బెల్లం వేసి కొబ్బరికాయలు కొట్టి ధూపదీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, తిరునాళ్ల నిర్వహణకు అనధికారికంగా ఏర్పడిన కమిటీ దాతల నుంచి భారీగా విరాళాలు సేకరించింది. అయినా రూ.50, 100 చొప్పున దర్శన టికెట్లు వసూలు చేశారు. రూ.100 టికెట్లు కొన్న భక్తులు స్వామివారి దర్శనం కోసం తొక్కిసలాటకు గురయ్యారు. అలాగే త్రై అమావాస్య సందర్భంగా జిల్లావ్యాప్తంగా అన్ని వైష్ణవ ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి.

• రంగనాథుడికి గరుడ సేవ



త్రై అమావాస్య సందర్భంగా శుక్రవారం రాత్రి తల్పగిరి రంగనాథ స్వామి స్వర్ణ గరుడ వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథుడికి తిరుమంజన సేవ, అనంతరం పూలంగి సేవ, ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ ఉత్సవాలను దర్మకర్తల చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, మాజీ చైర్మన్ మంచికంటి సుధాకర్ రావు, ధర్మకర్తలు, ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు, అర్చకులు పాల్గొన్నారు.

"కంటైనర్ టెర్మినల్‌ను మారుస్తున్నారన్న విషయం నెల రోజుల ముందే మా దృష్టికి వచ్చింది. దీనిపై పోర్టు యాజమాన్యంతో మాట్లాడాం. నెమ్మదిగా కంటైనర్లను విత్‌డ్రా చేయాలన్న ఆలోచన ఉందట. చెన్నైకు మార్చాలని ప్రయత్నిస్తున్నారట. దీనిపై దృష్టి పెట్టాలని యాజమాన్యానికి సూచించాం. అయితే మొత్తం ఒకసారి తీయడం లేదని, ఆపరేషన్‌కు ఇబ్బందిగా ఉన్న వెజల్స్‌ను మారుస్తున్నామని వారు చెప్పారు.

- జనవరి 21న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాటలివి.



కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ మూసివేస్తారన్న ప్రచారం అవాస్తవం. గత సంవత్సరం కార్గో ద్వారా రూ.72 కోట్లు పన్నుల రూపంలో వస్తే ఈ ఏడాది రూ.80 కోట్లు వచ్చింది. కంటైనర్ టెర్మినల్ తరలించినా, ఉద్యోగాలు తీసేసినా, పోర్టులో స్థానికులకు ప్రాధాన్యం లేకున్నా, పోర్టు అభివృద్ధి చేయకపోయినా నేను పోర్టు ముందు కూర్చొని నిరసన చేస్తా.

- జనవరి 25న మంత్రి కాకాణి మాటలు

కంటైనర్ టెర్మినల్ తరలింపుపై పోరాడాల్సిన విషయం. ప్రతిపక్షాలు ఎవరి పంథాలో వారు పోరాడాలి. ఎవరు వచ్చినా, ఎవరు రాకపోయినా మా ప్రయత్నం తీవ్రంగా ఉంటుంది. అటు కేంద్ర ప్రభుత్వం ద్వారా లేదా పోర్టు యాజమాన్యం ద్వారా కచ్చితంగా వెజల్ తెప్పిస్తాం. ఆ వెజల్ తెచ్చిన రోజు మీడియా అంతటిని తీసుకెళ్తా. ఎన్నూరు, కాటుపల్లి పోర్టుల్లో ఎక్కడైనా వ్యాపారం చేసుకోవచ్చని, కానీ బయట నుంచి వచ్చే వాటిల్లో కనీసం 20 శాతమైనా కృష్ణపట్నంలో లిఫ్ట్ చేయమని యాజమాన్యానికి చెప్పాం. కంటైనర్ టెర్మినల్ తరలింపుపై ఉద్యోగులు నన్ను కలవగానే జనవరి 24వ తేదీన నేను కేంద్ర మంత్రికి లేఖ రాశాను.

- ఫిబ్రవరి 9వ తేదీన మంత్రి కాకాణి మాటలు



పూటకో మాటతో సరి!

• కృష్ణపట్నం పోర్టుపై మంత్రి కాకాణి వ్యాఖ్యలతో ప్రజలు విస్మయం

ఇవీ కృష్ణపట్నం పోర్టులోని కంటైనర్ తరలింపు వ్యవహారంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాటలు. కంటైనర్ తరలింపు విషయాన్ని టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జనవరి 20వ తేదీన వెలుగులోకి తెచ్చారు. అయితే అనుకున్నట్లుగానే ఇప్పుడు కృష్ణపట్నంలో కంటైనర్ ఆపరేషన్లు ఆగిపోయాయి. దీనిపై గురువారం అఖిలపక్ష పార్టీలన్నీ పోర్టులోకి వెళ్లి యాజమాన్యంతో చర్చించి అల్టిమేటం జారీ చేశాయి. ఈ క్రమంలో శుక్రవారం మంత్రి కాకాణి మీడియా సమావేశం ఏర్పాటు చేసి గతానికి భిన్నంగా మాట్లాడారు. అంతకముందు పోర్టు ద్వారా ఆదాయం పెరిగిందని చెప్పిన మంత్రి, ఇప్పుడు కంటైనర్ల సంఖ్య తగ్గిందని ఒప్పుకున్నారు. కంటైనర్ టెర్మినల్ ఉంటే ఏం లాభం.. కంటైనర్ల హ్యాండ్లింగ్ జరగాలి.. కదా అంటూ కొత్తరాగం అందుకున్నారు. వెజల్స్ (కంటైనర్లను తీసుకొచ్చే ఓడ)ను తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నామని చెప్పారు. కంటైనర్ తరలింపు విషయాన్ని ఉద్యోగులు తన దృష్టికి తీసుకురాగానే జనవరి 24న కేంద్ర మంత్రికి లేఖ రాసినట్లు తెలిపారు. మరి జనవరి 21వ తేదీకి నెల రోజుల ముందే కంటైనర్ టెర్మినల్ విషయం తమ దృష్టికి వచ్చిందని తొలుత చెప్పిన మంత్రి అప్పుడే ఎందుకు మేల్కోలేదు, లేఖ రాయలేదన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిని బట్టి చూస్తే కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టర్మినల్‌ను క్రమేనా మూసివేస్తున్నారన్న విషయం తెలిసి కూడా ప్రభుత్వం పట్టించుకోలేదా!? లేక ప్రభుత్వ తీరు మూలంగానే కంటైనర్ టెర్మినల్ తరలిపోతోందా.. అన్న అనుమానాలను ఉద్యోగులు, స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

నెల్లూరుకు తీరని లోటు

కృష్ణపట్నం పోర్టు ఏర్పాటుకు నెల్లూరు జిల్లా ఎంతో త్యాగం చేసింది. వేల ఎకరాల భూములను ఇవ్వడమే కాకుండా పొల్యూషన్‌ను కూడా భరిస్తోంది. పోర్టు ఆధారంగా వేల ఎకరాల్లో పారిశ్రామిక పార్కులు వెలిశాయి. పోర్టులోని కంటైనర్ టెర్మినల్ ద్వారా నెల్లూరు, కడప, చిత్తూరు, అనంతపురం, కర్నూలు, బెంగళూరు, శ్రీసిటీ ప్రాంతాల్లోని పరిశ్రమలు ముడి సరుకులను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. దీనివల్ల రవాణా చార్జీలు తగ్గడంతో పాటు ట్రావెలింగ్ డ్యామేజీలు తక్కువగా ఉంటున్నాయి. పరిశ్రమలే కాకుండా రైతులకు కూడా కృష్ణపట్నంలోని కంటైనర్ టర్మినల్ ఎంతగానో ఉపయోగపడుతోంది. ఇప్పుడు కంటైనర్ టర్మినల్ ఆపరేషన్లు నిలిచిపోవడం మూలంగా అటు పరిశ్రమలపై, ఇటు రైతాంగంపై తీవ్ర ప్రభావం పడుతుంది. గతేడాది ఖరీఫ్ సీజన్లో బియ్యం ఎగుమతులకు కృష్ణపట్నం పోర్టులో కంటైనర్లు ఇవ్వలేదు. దీంతో నెల్లూరు జిల్లా వ్యాపారులంతా కాకినాడ పోర్టు ద్వారా బియ్యాన్ని ఎగుమతి చేశారు. అప్పుడు నెల్లూరు నుంచి కాకినాడ పోర్టుకు పుట్టికి రూ.2 వేల వరకు రవాణా ఖర్చు అవ్వగా ఆ మొత్తాన్ని ధాన్యం కొనుగోలు సమయంలో రైతులకు తగ్గించారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

అమ్మో... బర్డ్‌ఫ్లూ!

- పొదలకూరులో భారీగా చనిపోతున్న కోళ్లు
- ఇటీవల 20 వేల వరకు మృత్యువాత
- శాంపిల్స్‌ను భోపాల్‌కు పంపిన వెటర్నరీ అధికారులు

నెల్లూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బర్డ్ ఫ్లూ కలకలం రేపుతోంది. కొన్నేళ్ల క్రితం కోళ్లు, పక్షులు, మనుషులపై తీవ్ర ప్రభావం చూపిన ఈ వైరస్ లక్షణాలు మళ్లీ జిల్లాలో కనిపిస్తున్నాయి. గడిచిన రెండు వారాలుగా పొదలకూరు మండలంలో భారీగా కోళ్లు చనిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటివరకు 20 వేల కోళ్ల వరకు చనిపోయినట్లు సాగుదారులు చెబుతున్నారు. దీంతో పౌల్ట్రీ రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. పొదలకూరు మండలం మహ్మదాపురంలో చిన్మయిరెడ్డి అనే రైతు 3500 కోళ్లు పెంచుతుండగా శుక్రవారానికి 20 కోళ్లు మాత్రమే మిగిలాయి. అలానే చాటగొట్ల గ్రామంలో చదలవాడ రమేష్ అనే రైతు 9 వేల కోళ్లతో ఫారం నిర్వహిస్తుండగా ఇప్పటికి 8800 కోళ్లు చనిపోయినట్లు చెబుతున్నారు. అదే గ్రామంలో మణిదీప్ అనే రైతుకు చెందిన 1500 కోళ్లు, రత్నగిరి గ్రామంలో మరో రైతు వెయ్యి కోళ్లు పెంచుతుండగా అన్నీ చనిపోయాయి. అంతుచిక్కని వైరస్‌తో ఫారాల్లోని కోళ్లు చనిపోతుండటంతో మరుపూరు, వెలికంటిపాలెంలోని రైతులు తమ వద్ద ఉన్న కోళ్లను వెంటనే విక్రయించేశారు. ఒక్క పొదలకూరు మండలంలోనే ఇటీవల 20 వేల వరకు కోళ్లు చనిపోయి ఉంటాయని అంచనా.



పొదలకూరు : మహ్మదాపురంలో శుక్రవారం చనిపోయిన కోళ్లు

• అధికారుల అప్రమత్తం

వెటర్నరీ అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. పొదలకూరు మండలంలోని కోళ్ల ఫారాలకు వెళ్లి చనిపోయిన కోళ్ల కళేబరాల నుంచి శాంపిల్స్ సేకరించారు. విజయవాడలోని వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన శాస్త్రవేత్తలు జిల్లాకు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. ఒక్కసారి బర్డ్ ఫ్లూ పంజా విసిరితే కోళ్లు, బాతులు, పక్షులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఒకవేళ నిజంగా బర్డ్ ఫ్లూ వైరస్‌తోనే ఈ కోళ్లన్నీ చనిపోతుంటే చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. వైరస్ విస్తరించకుండా ప్రోటోకాల్ పాటించాలని చెబుతున్నారు. అధికారులు ఎంత త్వరగా ఈ వైరస్‌ను నిర్ధారిస్తే అంత మంచిదని సూచిస్తున్నారు. పొదలకూరుతో పాటు మరికొన్ని మండలాల్లో కూడా పౌల్ట్రీ సాగు జరుగుతోంది. ఆ రైతులు కూడా నష్టపోకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కాగా దీనిపై పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ మహేశ్వరుడును సంప్రదించగా పొదలకూరు మండలంలో కోళ్లు చనిపోతుండడంపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. వెటర్నరీ బయోలాజికల్ రీసర్చ్ ఇనిస్టిట్యూట్ నుంచి శాస్త్రవేత్తలు వచ్చి శాంపిల్స్ సేకరించారని తెలిపారు. ఆ శాంపిల్స్‌ను భోపాల్‌లోని ల్యాబ్‌కు పంపినట్లు చెప్పారు. అక్కడ ఏ వైరస్‌తో కోళ్లు చనిపోతున్నాయో నిర్ధారణ కాగానే అందుకు తగిన విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

విషతుల్యంగా చేపల గుంటలు

● విచ్చల విడిగా కోళ్లవ్యర్థాల వినియోగం ● పట్టించుకోని అధికారులు



కోళ్లవ్యర్థాలతో సాగుచేస్తున్న చేపలగుంట



డ్రమ్ముల్లో కోళ్లవ్యర్థాలు తరలిస్తున్న వాహనం

అనంతసాగరం, ఫిబ్రవరి 9: చేపల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోకుండా చేపల గుంటల్లో కోళ్లవ్యర్థాలు వేసి విషతుల్యంగా మారుస్తున్నా అధికారుల్లో ఎలాంటి చలనం లేదు. మండలంలోని రేవూరు, శంకరనగరం, గౌరవరం, పాతదేవరాయపల్లి తదితర గ్రామాల్లో చేపలసాగు చేపడుతున్నారు. ఈ సాగుకు మత్స్యశాఖ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంది. అయితే ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే గుంటలు ఏర్పాటు చేసి చేపలను ఉత్పత్తి చేస్తున్నారు. అంతేకాకుండా గుంటలో నిల్వ ఉన్న వ్యర్థనీటిని బయటకు తరలించి పర్యావరణానికి హానికలిగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. చేపల పెంపకంలో ఎలాంటి హానికరమైన పదార్థాలను వాడకూడదు, కానీ చికెన్ మార్కెట్‌లో దొరికే వ్యర్థాలను తీసుకొచ్చి చేపల పెంపకం చేపడుతున్నారు. అనంతసాగరం, సోమశిల, మర్రిపాడు, బద్వేల్ ప్రాంతాల నుంచి సేకరించిన వ్యర్థాలను గుంటల్లో వేసి సాగు చేస్తున్నారు. కోళ్లవ్యర్థాలతో సాగు చేసిన చేపలు తింటే ప్రజలు క్యాన్సర్‌తో పాటు విష రోగాలకు గురయ్యే ప్రమాదం ఉంది. అయినా నిబంధనలు పాటించ కుండా చేపలసాగు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగటమాడు తున్నారు. అలాగే కోళ్లవ్యర్థాలను గుంటలకు తరలించే క్రమంలో గ్రామాల్లో వచ్చే దుర్వాసనతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

దుర్గంపై గుప్తనిధుల తవ్వకాల ముఠా సంచారం

ఉదయగిరి, ఫిబ్రవరి 9: ఉదయగిరి దుర్గంపై రెండు రోజులుగా గుప్తనిధుల తవ్వకాల ముఠా సంచరిస్తున్నట్లు సమాచారం. దుర్గంపై ఉన్న పెద్ద, చిన్న మసీదులు, గుర్రపుశాలలు తదితర చోట సాధు వేషంలో ఉన్న వ్యక్తులు తవ్వకాలు చేస్తున్నారని, వీరికి కొందరు స్థానికులు కూడా సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దుర్గంపై రెండు రోజులుగా రాత్రి వేళల్లో లైట్లు వెలుగుతున్నాయి. అంతేకాకుండా దుర్గంపైకి వెళ్లిన కొందరు యువకులు వారిని చూసి భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దుర్గంపై నిఘా ఉంచి తవ్వకాలు జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

రైస్‌మిల్లుపై కేసు నమోదు

కావలి, ఫిబ్రవరి 9: కావలి పట్టణంలోని వెంకటశేషాద్రి రైస్‌మిల్లులో రేషన్ బియ్యం నిల్వలు ఉన్నాయన్న ఫిర్యాదుపై శుక్రవారం కావలి ఒకటో పట్టణ సీఐ రాజేష్ ఆ మిల్లుపై 6ఏ కేసు నమోదు చేశారు. వెంకటశేషాద్రి రైస్‌మిల్లులో రేషన్ బియ్యం ఉన్నాయనే ఫిర్యాదు మేరకు బుధవారం సివిల్ సప్లయ్, విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 124 బస్తాలలో 6,200 కిలోల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వాటిపై కావలి డీటీ జూలియా బాయి చేసిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హత్య కేసులో జీవిత ఖైదు

నెల్లూరు(లీగల్), ఫిబ్రవరి 9: పాత కక్షలు మనుసులో పెట్టుకొని హత్య చేశాడన్న కేసులో జలదంకి మండలం చామదలకు చెందిన పందిటి శీనుకు జీవితఖైదు విధిస్తూ నెల్లూరు 3వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎల్.తేజోవతి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... నిందితుడు పందిటి శీనుకు అదే గ్రామానికి చెందిన మొద్దు నాగార్జునకు పాతకక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నాగార్జున 2019 ఆగస్టు 22న బజారుకెళ్లి వస్తానని తిరిగి రాలేదు. 23న అతను బ్రాహ్మణక్రాక సమీపంలోని పొలాల్లో శవమై తేలాడు. ఈ మేరకు జలదంకి పోలీసులు నాగార్జున తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిపై 302 ఐపీసీ కింద కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణలో నిందితుడు పందిటి శీనుపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జీవితఖైదుతోపాటు రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీ కేఎల్ నారాయణ వాదించారు.

బాలికపై లైంగిక దాడి కేసులో..

నెల్లూరు(లీగల్), ఫిబ్రవరి 9: ఏడేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న కేసులో నేరం రుజువు కావడంతో పంచాక్షరి మల్లికార్జున అనే నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 2018 జూన్ 10న ముత్తుకూరు మండలం జంగాలకండ్రిగకు చెందిన నిందితుడు పంచాక్షరి మల్లికార్జున అదే గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు ముత్తుకూరు పోలీసులు నిందితుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణ కాలంలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా జైలుశిక్షతోపాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీ. శైలజారెడ్డి వాదించారు.

మోటర్ బైక్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

వెంకటాచలం, ఫిబ్రవరి 9 : మండలంలోని గొలగమూడి క్రాస్ రోడ్డు సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఓ మోటర్ బైక్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు మండలంలోని అనికేపల్లి గ్రామానికి చెందిన పీ వెంకటశేషయ్య గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న అక్షయ పాత్ర మధ్యాహ్న భోజన పథకంలో సెక్యూరిటీ విభాగంలో పని చేస్తున్నాడు. పని నిమిత్తం రాత్రి విధులకు వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి నెల్లూరు వైపు వేగంగా వెళ్తున్న మోటర్ బైక్ అతనిని ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటశేషయ్యకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్, లారీ ఢీ : ఒకరి మృతి

వెంకటాచలం, ఫిబ్రవరి 9 : మోటారు బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని చెముడుగుంట పంచాయతీ పవన్‌కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వెంకటగిరి పట్టణానికి చెందిన వెంకటకృష్ణయ్య (27) మోటార్ బైక్‌పై వెళ్తుండగా నెల్లూరు నుంచి గూడూరు వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకట కృష్ణయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాల్లో చోరీ



తోటలచెరువుపల్లిలో తాళాలు పగలగొట్టిన ఆలయం

వరికుంటపాడు, ఫిబ్రవరి 9: మండలంలోని పలు ఆలయాల్లో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. వివరాల మేరకు విరువూరులో వెలసి ఉన్న పోలేరమ్మతల్లి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు గేటు తాళాలు పగలగొట్టి హుండీని చోరీ చేసి తీసుకెళ్లారు. అలాగే తోటల చెరువుపల్లిలోని వీరభద్రుడి ఆలయంలోనూ గేటు తాళాలు పగలగొట్టి ఉన్నారు. గురువారం రాత్రి సమయంలోనే ఆలయాల్లో చోరీకి పాల్పడ్డారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ నారాయణ సిబ్బందితో కలిసి చోరీ జరిగిన తీరును పరిశీలించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	140
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	248
స్కిన్‌లెస్	274
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5966
వెండి కిలో ధర	రూ. 72,700
వెండి ఒక గ్రాము	రూ. 74.70

తిక్కవరప్పాడులో..

వెంకటాచలం, ఫిబ్రవరి 9 : మండలంలోని తిక్కవరప్పాడు గ్రామానికి చెందిన కొప్పోలు నారాయణ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. నారాయణ తన ఇంటికి తాళం వేసుకుని పని నిమిత్తం గురువారం ఉదయం నెల్లూరుకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు పగలగొట్టి ఉండడంతో అనుమానంతో ఇంట్లోకి వెళ్లి చూడగా రూ.7వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు. అలాగే పోస్టల్ కార్యాలయం తలుపులు కూడా పగలగొట్టి అక్కడ నగదు లేకపోవడంతో వెళ్లి పోయి ఉండవచ్చని పలువురు తెలిపారు.

ఎన్నికల వేళ ఎత్తుగడ!

● పేదల ఇళ్లకు రిజిస్ట్రేషన్ల పేరుతో హడావుడి
● ఆసక్తి చూపని లబ్ధిదారులపై వలంటీర్ల ఒత్తిళ్లు
● పదేళ్ల తర్వాతే పూర్తి హక్కులు

సంగం, ఫిబ్రవరి 9 : జగనన్న లే అవుట్‌లో పేదలకు ఇచ్చిన సెంటు, సెంటున్నర స్థలాలకు రిజిస్ట్రేషన్ పేరుతో ప్రభుత్వం చేస్తున్న హడావుడి చూస్తే ఎన్నికల ఎత్తుగడగా ఉందని పలువురు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. అవగాహన లేని సచివాలయ సిబ్బంది పని చేయని సర్వర్‌తో పది రోజులుగా జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లకు పడరాని పాట్లు పడుతున్నారు. ఆగమేఘాల మీద జరుగుతన్న ఈ రిజిస్ట్రేషన్లతో పేదలకు ఇప్పుడు ఒరిగేదేమీ లేదంటున్నారు. పదేళ్ల తర్వాత అమ్మే హక్కులు వస్తాయి. ఈ తతంగం అంతా పేదల ఓట్లకు గాలం వేయడానికేనని విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో నవరత్నాల్లో భాగంగా మూడేళ్ల కిందట ఇళ్లు లేని పేదలకు ఊరికి చివర, వాగులు, వంకలు, కొండలు, గుట్టలు ఇలా అనువుగాని చోట జగనన్న లే అవుట్ ఏర్పాటు చేశారు. ఈ లే అవుట్లలో సుమారు 60 వేల మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. అందులో భాగంగా సంగం మండలంలో 22 జగనన్న లే అవుట్లలో సుమారు 773 మందికి ఇళ్ల స్థలాలు అందచేశారు. మొదట దశలో మంజూరు చేసిన మున్సిపాలిటీలలో నాల్గోవంతు ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. రూరల్ ప్రాంతంలో ఇప్పటికీ పది శాతం కూడా నిర్మాణాలకు నోచుకోలేదు. ఈ గృహ నిర్మాణాలను పూర్తి చేయలేక అధికారులు చతికిలపడ్డారు. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికలు రెండు నెలల్లో ఉండటంతో ప్రభుత్వం ఎత్తుగడలకు తెరలేపిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలే ఇళ్లు కట్టుకోలేక నిరాశతో ఉన్న పేదలకు ఆర్థిక సాయం చేయాల్సిన ప్రభుత్వం పట్టించుకోకుండా ఇళ్ల రిజిస్ట్రేషన్ పేర పేదల ఓట్లకు గాలం వేయటానికి జగన్నాటకమని ప్రతిపక్ష పార్టీల నాయకులు విమర్శిస్తున్నారు.



జగనన్న లే అవుట్‌లో నిర్మాణంలో ఉన్న కాలనీ ఇళ్లు

● **మొరాయిస్తున్న సర్వర్లు..**

జనవరి 31వ తేదీ నుంచి పేదల ఇంటి స్థలాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టినా సర్వర్లు మొరాయిస్తున్నాయి. దీనికితోడు అనుభవం లేని సచివాలయ సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. ఒకవైపు ఉన్నతాధికారుల ఒత్తిళ్లు ఎక్కువవడంతో సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు ఒత్తిడికి గురవుతున్నారు. పది రోజులుగా తంటాలు పడుతున్నా ఇప్పటికి పదో వంతు రిజిస్ట్రేషన్లు పూర్తి కాలేదు. జిల్లావ్యాప్తంగా 61,183 స్థలాకు రిజిస్ట్రేషన్ లక్ష్యంకాగా ఇప్పటికి 10,718 స్థలాలకు లబ్ధిదారుల పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. సంగం మండలంలో 773 స్థలాలకుగాను 177 మందికి రిజిస్ట్రేషన్ పూర్తయ్యాయి.

● **స్పందన కరువు**

ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలకు ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేసి ఇస్తామని అధికారులు మొత్తుకుంటున్నా లబ్ధిదారుల్లో స్పందన కరువవుతోంది. దీంతో వలంటీర్లు లబ్ధిదారుల కోసం పరుగెడుతున్నారు. రిజిస్ట్రేషన్లు చేసుకోకపోతే స్థలాలు వెనక్కి తీసుకుంటారని బెదిరిస్తుండటంతో లబ్ధిదారులు సచివాలయాలకు వస్తున్నారు. వ్యయ ప్రయాసలు కోర్చి సచివాలయాలకు వెళ్తున్నా సర్వర్ మొరాయిస్తుండటంతో అవస్థలు పడుతున్నారు.

● **గతంలో ఓటీఎస్ పేరుతో హడావుడి**

2004 ముందు నిర్మించిన పక్కా గృహాలకు హౌసింగ్ నుంచి పొందిన రుణాల మేరకు రూ.10 వేలు, 20 వేలు, 30 వేలు చొప్పున చెల్లించితే లబ్ధిదారుల పేరుతో రూపాయి ఖర్చుతో రిజిస్ట్రేషన్ చేయిస్తామని ఓటీఎస్ (వన్ టైం సెటిల్‌మెంట్) పేరుతో హడావుడి చేశారు. వీటికి బ్యాంకులు రుణాలు కూడా ఇస్తారని నమ్మించారు. వారివద్ద డబ్బులు లేకపోయిన ఐకేపీలో రుణం ఇప్పించి మరీ ఓటీఎస్‌లో రిజిస్ట్రేషన్లు చేయించారు. ఆ రిజిస్ట్రేషన్లతో బ్యాంకుల వద్దకు వెళ్లితే మేనేజర్లు వెనక్కి పంపారు. కానీ ఒక్కరికీ కూడా రుణాలు ఇచ్చిన దాఖలాలు లేవు. ఈ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల కూడా అంతే నేమోనని.. దీనివల్ల ఒరిగేదేమీ లేదని లబ్ధిదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

● **పదేళ్ల తర్వాతే హక్కులు**

ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసినా పదేళ్ల తరువాత పేదలకు పూర్తి హక్కులు ఉంటాయి. ఈలోపు వాటిని వారు విక్రయించే అవకాశం ఉండదు. ఇంతదానికి హడావుడి దేనికని లబ్ధిదారులు విమర్శిస్తున్నారు. వీటికి కనీసం బ్యాంకు రుణాలైనా వస్తాయా, లేదా అంటూ లబ్ధిదారులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

చిన్నారులు, కిశోర్ బాలలు

ఆల్బెండజోల్ మాత్రలు వాడాలి

● కలెక్టర్ హరినారాయణన్



విద్యార్థినులకు మాత్రలు వేస్తున్న కలెక్టర్

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 9 : చిన్నారులు, కిశోర్ బాలలు నులి పురుగల నివారణకు ఆల్బెండ జోల్ మాత్రలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. శుక్రవారం నెల్లూరు నగరంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికలకు నులి పురుగుల నివారణ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ విద్యార్థులలో రక్తహీనత, బరువు తగ్గడం, కడుపునొప్పి, వాంతులు, విరోచనాలు వంటి ఆరోగ్య సమస్యలకు ఈ నులి పురుగుల మందులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఇందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలన్నారు. ఈ నెల 16వ తేదీన మరొక సారి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా మాత్రలు వేసుకోవాలని కోరారు. ఒకటి నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు సగం మాత్ర, 2 నుంచి 19 ఏళ్లలోపు ఉన్నవారికి ఒక మాత్ర వేసుకోవాలన్నారు. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత మాత్రమే ఈ మాత్రను నమిలి చప్పరించేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, హెచ్‌ఎం జ్యోతిర్మయి, డిప్యూటీ డీఈవో లక్ష్మీప్రసన్న, డాక్టర్ సుధీర్, శ్రీనివాసులు, దీపకళ, జయశ్రీ, విజయ తదితరులు పాల్గొన్నారు.

హజారే రెడీమెడ్ గార్మెంట్ పనులు

త్వరగా పూర్తి చేయాలి: కలెక్టర్

వెంకటాచలం, ఫిబ్రవరి 4 : హజారే రెడీమెడ్ గార్మెంట్ పరిశ్రమ పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని కాకుటూరులోని ఎంఎస్‌ఎంఈ పథకం ద్వారా నిర్మిస్తున్న హజారే రెడీమెడ్ వస్త్ర పరిశ్రమను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశ్రమకు సంబంధించిన బిల్డింగ్ నిర్మాణం పూర్తయిందని, విద్యుత్ పనులను కూడా వారంలో పూర్తి చేస్తామని, మిషనరీ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు కాంట్రాక్టర్ కలెక్టర్‌కు వివరించారు. అలాగే పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ సుధాకర్ పరిశ్రమ ఏర్పాటు, మౌలిక వసతులపై కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ వెంట ఐపీఓ శ్యామ్యూల్, తహసీల్దారు పూర్ణచంద్రరావు, సీఈవో సురేష్, ఫీల్డ్ వర్కర్ సురేంద్ర, తదితరులు ఉన్నారు.

జామాయిల్ కర్ర వేలంలో

అక్రమాలపై విజిలెన్స్ విచారణ

కావలి, ఫిబ్రవరి 9: జామాయిల్ కర్ర వేలంలో పలు అక్రమాలు చోటుచేసుకున్నాయని రైతుసంఘం నాయకులు చేసిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కావలి అటవీశాఖ కార్యాలయంలో జిల్లా అటవీశాఖ విజిలెన్స్ అధికారి రవిశంకరశర్మ తమ సిబ్బందితో విచారణ చేపట్టారు. నెల్లూరు, తిరుపతి జిల్లాలలో జామాయిల్ కర్ర వేలంలో అక్రమాలు జరిగాయని రైతు సంఘాల నాయకులు ఈశ్వర్‌ప్రసాద్, బలిజేపల్లి వెంకటేశ్వర్లు, కుర్రా వీరారెడ్డి, హనుమారెడ్డిలు అటవీశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. ఈమేరకు విజిలెన్స్ అధికారి విచారణ చేపట్టగా ఫిర్యాదుదారులలో ఒక్కరే రావటంతో స్థానికంగా రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారి మాట్లాడుతూ విచారణకు ఒక్కరే రావటంతో మరోసారి విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే క్షేత్రస్థాయికి వెళ్లి జామాయిల్ కటింగ్ జరిగిన ప్రాంతాలను కూడా పరిశీలించి సంబంధిత రికార్డులను పరిశీలించిన అనంతరం అవసరమైతే తగు చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.

13న జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 9 : 2022-23 విద్యా సంవత్సరానికి జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఈ నెల 13వ తేదీన నెల్లూరులో జరగనుంది .దర్గామిట్ట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఏర్పాట్లను డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి శుక్రవారం పరిశీలించి, సంబంధిత అధికారులతో సమీక్షించారు. 154 ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న నేపథ్యంలో సంబంధిత డీప్యూటీ ఈఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో 18 కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. కమిటీ సభ్యులంతా వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించి విజయవంతం చేయాలని సూచించారు. ప్రదర్శనలో పాల్గొనే విద్యార్థులు, సంబంధిత గైడ్ టీచర్లు మంగళవారం ఉదయం 7 గంటల కల్లా జడ్పీ పాఠశాలలో హాజరై తమ ప్రాజెక్టులను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మూడు హార్డ్‌కాపీలు, ఒక సాఫ్ట్ కాపీ (సీడీ లేదా పెన్‌డ్రైవ్‌లో) ప్రొఫార్మాలతో నింపి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో కావలి డిప్యూటీ ఈఓ రఘురామయ్య, నెల్లూరు ఎంఈఓలు మురళీధర్, బిక్షాలు, అబ్దుల్ హమీద్, పాఠశాల హెచ్‌ఎం కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి తెలుసుకోవాలి

● నోడల్ అధికారుల శిక్షణలో బాపిరెడ్డి



మాట్లాడుతున్న బాపిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 9 : ఎన్నికలు సక్రమంగా నిర్వహించడానికి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పూర్తి స్థాయిలో తెలుసుకోవాలని నుడా వీసీ, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి ఎస్.బాపిరెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని తిక్కన భవన్‌లో ఎన్నికల నోడల్ అధికారులకు రెండో రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బాపిరెడ్డి మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఎన్నికల్లో ఖర్చుచేసే ప్రతిరూపాయిని నమోదు చేయాలన్నారు. ఎన్నికల శిక్షణ తీసుకున్న మాస్టర్ ట్రైనర్లు కింది స్థాయి అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల్లో రాజకీయపార్టీలు చేసే ఖర్చుల వివరాలు నమోదు గురించి జిల్లా సహకారశాఖాధికారి తిరుపతయ్య పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవి, జిల్లా సహకారశాఖాధికారి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

12న ఉపాధి కార్యాలయంలో

జాబ్‌మేళా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 9: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 12వ తేది జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి కేవీ రామాంజనేయులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీలలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 20 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగి, పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ విద్యార్హతలు కలిగిన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆధార్ కార్డుతో 12వ తేది ఉదయం 10.30 నిమిషాలకు జిల్లా ఉపాధి కార్యాలయంలో జరిగే జాబ్ మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు.

నేతలకు లాభం..

ప్రజలకు శాపం!

● నెరవేరని సీఎం హామీ.. పూర్తికాని పెన్నా గోడలు
● 26 నెలలు గడిచినా అతీగతీ లేదు
● ఐదో వంతు కూడా పూర్తికాని గోడల నిర్మాణం
● 2 కి.మీ నుంచి 650 మీటర్లకు తగ్గిన వాల్స్
● ఎస్టిమేషన్లు, రివైజ్ ఎస్టిమేషన్లతోనే సరి
● మొత్తం నిర్మాణానికి మరో రూ.150 కోట్లు అవసరం

నెల్లూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజాప్రతినిదులు ఆదేశించడం అధికారులు తల ఊపడం తప్ప చేస్తున్న పని సరైనదా!? కాదా!? అని బేరీజు వేసుకునే పరిస్థితి ఇరిగేషన్ శాఖలో లేకుండా పోయింది. ప్రజాప్రతినిధుల స్వలాభానికి తోడు అధికారుల అవినీతి జతకట్టడంతో పేదల కష్టాలు రెట్టింపవుతున్నాయి. నెల్లూరు నగరంలో పెన్నా రక్షణ గోడల నిర్మాణాన్ని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. వర్షాకాలం వస్తోందంటే ముంపు ప్రాంతాలైన వెంకటేశ్వరపురం, జనార్దనరెడ్డికాలనీ, భగత్‌సింగ్ కాలనీలు వణికిపోతున్నాయి. 2020, 2021 సంవత్సరాల్లో వరుసగా వరదలు సంభవించడంతో ఈ ప్రాంతవాసులు కుదేలయ్యారు. ఈ క్రమంలో అక్కడ పర్యటించిన సీఎం జగన్మోహన్‌రెడ్డి రూ.వంద కోట్లతో పెన్నా గోడలను నిర్మిస్తామని 2021, డిసెంబరులో హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఎనిమిది నెలలకు శంకుస్థాపన సందర్భంగా జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, నగర ఎమ్మెల్యే అనీల్ కుమార్ యాదవ్‌లు ఏడాదిలోపు పనులు పూర్తి చేస్తామని ప్రకటించారు. కానీ రెండేళ్లు గడిచిపోయినా గోడల నిర్మాణం పునాదుల దశ దాటలేదు. ఇందుకు ప్రజాప్రతినిధుల ధనదాహం ఎంత ఉందో అంతకుమించి అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. అది నుంచి డిజైన్లను మార్చడం, ఎస్టిమేషన్లను రివైజ్ చేయడంతోనే కాలం గడిచిపోతోంది. రక్షణ గోడలు నిర్మించలేదు కానీ చివరకు తేల్చిందేమిటంటే పూర్తిగా రక్షణ గోడలు నిర్మించేందుకు మరో రూ.150 కోట్ల వరకు అవసరమవుతాయని నిర్ధారించారు. ఎప్పుడో రెండేళ్ల క్రితం మొదలైన పనులే ఇంత వరకు అతీగతీ లేకుండా పోగా ఇప్పుడు కొత్తగా మళ్లీ అనుమతులు వచ్చి పనులు పూర్తి చేయడం సాధ్యమేనా.. అన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రస్తుతం పనులు జరుగుతున్న తీరు చూస్తే పూర్తవడానికి మరో రెండేళ్ల సమయం పట్టేలా కనిపిస్తోంది. ఈలోపు మళ్లీ పెన్నాకు వరదొస్తే నెల్లూరు నగర ప్రజలు ఇల్లూవాకిలీ వదిలి వెళ్లిపోవాల్సిన దుస్థితి దాపురిస్తుంది.

● **రాజకీయ జోక్యమే కారణం**

2021, నవంబరులో వరదల సమయంలో రూ.80.56 కోట్ల అంచనాతో పొర్లుకట్టల నిర్మాణాలకు తెలుగు గంగ ప్రాజెక్టు అధికారులు టెండర్లు పిలిచారు. ఈ వర్కును దక్కించుకునేందుకు అధికార పార్టీలోని ఇద్దరు ప్రజాప్రతినిధుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. నలుగురు కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేయగా ఇద్దరు డిస్క్వాలిఫై అయ్యారు. మిగిలిన ఇద్దరు రివర్స్ టెండరింగ్‌లో నువ్వా.. నేనా.. అన్నట్లు పోటీ పడడంతో చివరకు 13.38 శాతం లెస్‌కు (రూ.69.78 కోట్లు) శ్రీసాయి కృష్ణ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ పనులు దక్కించుకుంది. అయితే, నగరానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి సూచించిన వారికి వర్కు దక్కకపోవడంతో ఈ వర్కును రద్దు చేస్తారంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అనుకున్నట్లుగానే అగ్రిమెంటు జరగాల్సిన సమయంలో మట్టికట్టల స్థానంలో కాంక్రీటు గోడలు నిర్మించాలన్న కొత్త ప్రతిపాదన తెరమీదకు వచ్చింది. మట్టికట్ట నిర్మిస్తే ఎక్కువ ఇళ్లు తొలగించాల్సి ఉంటుందని, అదే కాంక్రీటు గోడ అయితే తక్కువ ఇళ్లను తొలగిస్తే సరిపోతుందని అధికారులు టెండర్ రద్దు చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేశాక ఎస్టిమేషన్లు తయారు చేసిన ఇరిగేషన్ అధికారులకు ఈ విషయం ముందుగా తెలియదా.. అన్నదే అసలు ప్రశ్న. ఆ తర్వాత రూ.81.85 కోట్లకు అంచనాలు సవరించి 2022 ఏప్రిల్‌లో మరోమారు టెండర్లు పిలిచారు. ఈ దఫా కేవలం రెండు సంస్థలు మాత్రమే టెండర్లో పాల్గొన్నా యి. మొదటి సారి మాదిరిగా ఇక్కడ పోటీ జరగలేదు. దీంతో 3.55 శాతం ఎక్సెస్‌తో రూ.84.76 కోట్లకు బెకెమ్-సిరి జాయింట్ వెంచర్ సంస్థ పనులు దక్కించుకుంది.



అసంపూర్తిగా ఆగిపోయిన పెన్నా రక్షణ గోడల పనులు

కొత్త ఎస్టిమేషన్లు పంపాల్సి ఉంది

పెన్నా రక్షణ గోడల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే కొంత నెమ్మదిగా జరుగుతున్న మాట వాస్తవమే. రివైజ్ ఎస్టిమేషన్లు అప్రూవయ్యాయి. పనుల్లో వేగం పెంచుతాం. మిగిలిన దూరాన్ని రెండో విడతలో చేపట్టే విధంగా కొత్త ఎస్టిమేషన్లు తయారు చేసి పంపాల్సి ఉంది.

- వై పెంచలయ్య, ఇరిగేషన్ డీఈఈ

● **దూరం తగ్గింది.. అంచనా పెరిగింది!**

పోనీ ఈదఫా అయినా పనులు మొదలయ్యాయా అంటే అదీ లేదు. తీరిగ్గా పది నెలల తర్వాత కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టి పది శాతం పనులు చేశారు. అయితే ప్రస్తుత డిజైన్ ప్రకారం కాంక్రీట్ వాల్ నిర్మిస్తే అది భారీ వరదలను తట్టుకోలేదని గుర్తించారు. దీంతో మళ్లీ డిజైన్ మార్చు అంటూ హడావిడి చేయడంతో పనులకు బ్రేక్ పడింది. కొత్త డిజైన్లను తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపగా కొన్ని నెలల తర్వాత ఇటీవల అప్రూవల్ వచ్చింది. అయితే కాంట్రాక్టర్ అగ్రిమెంట్ జరిగిన రూ.84.76 కోట్లకు అనుగుణంగానే కొత్త డిజైన్‌కు అనుమతులిచ్చారు. దీంతో వెంకటేశ్వరపురం నుంచి జాతీయ రహదారి దిగువున వరకు రెండు కిలోమీటర్ల మేర రక్షణ గోడ నిర్మించాల్సి ఉండగా అది 650 మీటర్లకు తగ్గిపోయింది. మిగిలిన 1350 మీటర్లకు మళ్లీ కొత్తగా ఎస్టిమేషన్లు తయారు చేసి పంపాల్సి ఉంది. ఇందుకు మరో రూ.150 కోట్లకు పైగా అవసరమవుతుందని అధికారుల అంచనా. దీని మూలంగా రెండు కిలోమీ టర్ల స్థానంలో 650 మీటర్లు నిర్మించినా ప్రయోజనం ఉండదని, పెన్నాకు భారీ వరదలు వస్తే మళ్లీ నీరు ఇళ్ల మధ్యలోకి చేరుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇరిగేషన్ అధికారులు మొదటి నుంచీ ఒక ప్రణాళిక లేకుండా వ్యవహరించడం మూలంగా నేడు ముంపు ప్రాంత వాసులకు కష్టాలు తొలగడం లేదు. మట్టి కట్ట నిర్మించి ఉంటే ఈ పాటికి పనులు పూర్తయ్యేవని, ఇప్పుడు పెరిగిన రూ.150 కోట్లతో కట్ట నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన వారికి మంచి ఇళ్లు నిర్మించి ఇచ్చి ఉండొచ్చని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

పిల్లలకు నులి పురుగుల నిర్మూలన మాత్రలు వేయాలి



ఆత్మకూరు : విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు, ఫిబ్రవరి 9: పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలని జిల్లా బాల భవిత కేంద్రం (డీఈఐసీ) వైద్యాధికారి డాక్టర్ దినకర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నులి పురుగులతో రక్తహీనతతో పాటు పలు రుగ్మతలు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హైమ, సోషల్ వర్కర్ రమణ, ల్యాబ్ టెక్నీషియన్ రహీం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంగం : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అల్ బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. స్థానిక వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ సుమారు 7274 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసి మింగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలువాయి: మెయిన్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులతో అధికారులు, ఉపాధ్యాయులు నులిపురుగుల మాత్రలు మింగించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్, తహసీల్దారు స్వర్ణ, ఎంఈవోలు బాలకృష్ణారెడ్డి, శేషగిరి, వైద్యాధికారి రమాకుమారి, ప్రధానోపాధ్యాయులు ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనంతసాగరం: స్థానిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నులిపురుగులతో కలిగే అనారోగ్య సమస్యలపై అధికారులు, వైద్యసిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంపూర్ణమ్మ, ఎంపీడీవో తాజ్‌మన్సూర్ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్ : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు, చిన్నారులకు అల్ బెండజోల్ మాత్రలను మింగించినట్లు మండల వైద్యాధికారిణి ఎం.శివకల్పన తెలిపారు. పట్టణంలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మాత్రలను మింగించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 తోట శ్రీనివాసులు, హెచ్ఈ కె.వెంకటసుబ్బయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని పాఠశాలల్లోని విద్యార్థులకు అల్ బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కస్తూర్బాగాంధీ పాఠ శాల ప్రిన్సిపాల్ ఎస్‌కే. షాహిదా, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది మజీద్, రియాజ్, హెల్త్ అసిస్టెంట్ తిరుపాల్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): మండలంలో 4,270 మంది విద్యార్థులకుగాను 3,870 మందికి మాత్రలు మింగించినట్లు వైద్యులు అయూబ్‌అఫ్సర్, వనజ తెలిపారు. మండలంలోని నందిపాడు కస్తూర్బాగాంధీ పాఠశాలలో వైద్యులు విద్యార్థులకు మాత్రలను మింగించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాయిప్రసాద్, ఎంఈవో వెంగయ్య, ప్రిన్సిపాల్ అంజలీదేవి, సచివాలయాల కన్వీనర్ ఏ.వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ కార్య దర్శులు నజీముల్లా, వెంగళరెడ్డి, వైద్యసిబ్బంది బీబీజాన్, ఖాజామొహిద్దీన్, ఓంకారయ్య, అస్మతుల్లా, పార్వతీ తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట : బోగోలు మండలంలో పలు పాఠశాలల్లో విద్యార్థులకు కోవూరుపల్లి ఆరోగ్యకేంద్రం అధికారులు, సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలను అందచేశారు. తిప్ప డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు కోవూరుపల్లి వైద్యులు జి హారిక, నిత్యప్రశాంతి మాత్రలను అందచేశారు. బోగోలు ఎంపీపీ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలు, స్థానిక జూనియర్ కళాశాల, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నులిపురుగుల నివారణ మాత్రలను అందచేశారు. ఈ కార్యక్రమాలో హెచ్ఈవో కృష్ణమూర్తి, సూపర్‌వైజర్ విక్టోరియా, ఎంఎల్‌హెచ్‌పీ అనూష, ప్రిన్సిపాల్ పద్మావతి, ఆశా వర్కర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం: మండలంలోని 16 పంచాయతీలలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో 96.5 శాతం మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు లింగసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి డా. పి రమేష్ చెప్పారు. మిగిలిన 3.5 శాతం మందికి 16వ తేదీన మాత్రలు పంపిణీ చేస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ జి శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కలిగిరి : వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు రాకుండా చేసుకోవచ్చని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారిణి డా. బిజ్జం గీతారెడ్డి పేర్కొన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, ఎంఈఓ సురేష్, ఏఓ ఎన్‌వీవీ బ్రహ్మచారి, ఉపాధ్యాయ, వైద్యసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లూరు, ఫిబ్రవరి 9 : అల్లూరు సబ్‌స్టేషనులో మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ మస్తాన్ షరీఫ్ శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

ఫిషింగ్ హార్బర్‌కు వసతుల కల్పనలో వైసీపీ విఫలం

● మత్స్యకారులకు సేవచేయడం అదృష్టం : కావ్య



మత్స్యకార నేతలతో టీడీపీ ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, ఫిబ్రవరి 9: గంగపుత్రులైన మత్స్యకారులకు సేవచేసుకునే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నానని కావలి టీడీపీ ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి అన్నారు. బోగోలు మండలం పాతబగారుపాలెం, అలిచర్లబంగారుపాలెం, పాతకరపాలెంకు చెందిన మత్స్యకార నేతలు, మత్స్యకారులు శుక్రవారం కావలి పట్టణం ముసునూరులోని ఇన్‌చార్జి కావ్యక్రిష్ణారెడ్డిని కలిసి తమ మద్దతు తెలిపారు. పాత కరపాలెంకు చెందిన వైసీపీ వార్డు మెంబరు కొండూరు మురళీ టీడీపీలో చేరగా కండువా కప్పి క్రిష్ణారెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ టీడీపీ పాలనలో జువ్వలదిన్నెకు మంజూరైన ఫిషింగ్ హార్బర్‌కు రూ.288 కోట్లు మంజూరుచేసి అప్పట్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారన్నారు. దానికి మంచినీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఫిషింగ్ హార్బర్ పూర్తయితే మత్స్యకారులకు ఎంతో మేలు కలుగుతుందని, రానున్న ఎన్నికలలో కావలిలో తనను గెలిపించి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేస్తే పూర్తిస్థాయిలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చంద్రబాబు పూర్తిచేయగలరన్నారు. ఈ కార్యక్రమంలో కావలి మండల టీడీపీ అధ్యక్షుడు ఆవుల రామకృష్ణ, రాష్ట్ర మత్స్యకార సాధికార సమితి సభ్యుడు సోమయ్యగారి రమణ, బోగోలు మండల బీసీ సెల్ నాయకుడు వావిల శ్రీనివాసులు, మత్స్యకార నేతలు కుర్రు కొండయ్య, కడియాల గోవింద్, చిన్నంగారి శేఖర్, ప్రళయకావేరి మస్తాన్, వావిల చినవెంకటేశ్వర్లు, కోడూరు రామారావు, చిన్నిబాబు, వావిల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి



శనగ పంటను పరిశీలిస్తున్న కందుకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు అనసూయ

లింగసముద్రం, ఫిబ్రవరి 9: పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని కందుకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు అనసూయ సూచించారు. శుక్రవారం మండలంలోని రాళ్లపాడు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి టి అబ్రహం లింకన్‌తో కలిసి ఆమె శనగ పైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అధిక దిగుబడులకు తగిన సలహాలు, సూచనలు చేశారు. ఈ-క్రాప్ సూపర్ చెక్ రికార్డులను తనిఖీ చేశారు. ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ రేణుక, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెస్సార్‌లో ప్రాంగణ ఎంపికలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెస్సార్ యాజమాన్యం

కావలిటౌన్, ఫిబ్రవరి 9: పట్టణంలోని ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్నై బేస్డ్ కంప్యూటర్స్ ఈవోఎస్ గ్లోబ్‌వారు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో వివిధ కళాశాలల నుంచి 250మంది పాల్గొనగా 113మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ టీ ఉమ అధ్యక్షతన జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రాజ్‌కుమార్ చౌదరి విద్యార్థులను అభినందించి ప్రిన్సిపాల్‌తో కలిసి నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు రాజేష్, మస్తాన్‌వలీ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం

కొండాపురం, ఫిబ్రవరి 9: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ప్రిన్సిపాల్ శ్రీహరిరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గత ఏడాది పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందచేశారు. ఈకార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

బొద్దుకూరు పిచ్చయ్యకు డాక్టరేట్

కావలిటౌన్, ఫిబ్రవరి 9: కావలి పట్టణ ముసునూరుకు చెందిన బొద్దుకూరు పిచ్చయ్యకు హోప్‌థియోలాజికల్ యూనివర్శిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. సామాజిక కార్యకర్తగా హ్యూమన్ రైట్స్ సంఘాల్లో చురుగ్గా పాల్గొంటూ పిచ్చయ్య చేస్తున్న సేవలను గుర్తించిన యూనివర్శిటీ వారు పిచ్చయ్యకు డాక్టరేట్ పురస్కారమందించారు. పలువురు పట్టణ ప్రముఖులు పిచ్చయ్యకు అభినందనలు తెలిపారు.

కొండాపురం తహసీల్దార్‌గా మస్తాన్

కొండాపురం, ఫిబ్రవరి 9: మండల నూతన తహసీల్దార్‌గా టీ మస్తాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు అభినందలు తెలిపారు.

రోడ్డు స్థలం ఆక్రమణ

కావలి, ఫిబ్రవరి 9: కావలి పట్టణ పరిధిలోని రోడ్లు, కాలువలు, మున్సిపల్ బావుల స్థలాలు కబ్జాకు గురౌతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. 6వ వార్డు వెంగయ్యగారిపాలెంలోని పోలేరమ్మ గుడి ఎదురుగా ఉన్న పాత ఇంటిని ఓ వ్యక్తి కొనుగోలు చేసి మరమ్మతు పనులు చేస్తూ పక్కన ఉన్న కాలువ, రోడ్డు స్థలాన్ని సైతం ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. దీంతో రోడ్డు కుచించుకు పోయిందని, మున్సిపల్ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆక్రమణలు అని తేలితే చర్యలు : కమిషనర్

అనేక చోట్ల కాలువలు, రోడ్ల స్థలాలు ఆక్రమణలకు గురౌతున్నట్లు మా దృష్టికి వస్తున్నాయి. ఆయా స్థలాలను పరిశీలించి వారిపై చర్యలు తీసుకుంటాం.

రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం : ఇంటూరి



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఇంటూరి

కందుకూరు, ఫిబ్రవరి 9 : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం కందుకూరు పట్టణంలోని 28వ వార్డు పంచాయతీరాజ్ కార్యాలయం, బలిజపాలెం ప్రాంతంలో ఇంటింటికీ తిరిగి బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంటూరి మాట్లాడుతూ అప్పులు చేయడం, బటన్ నొక్కడం తప్పితే పరిశ్రమలు నెలకొల్పి ఉద్యోగ, ఉపాధి కల్పించి రాష్ట్రానికి ఆదాయం సృష్టించడం చేతకాని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని విమర్శించారు. రాష్ట్రంలోనైనా, నియోజకవర్గంలోనైనా అభివృద్ధి పరుగులు పెట్టాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుని గెలిపించాలని, టీడీపీకి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, పాలంకి ప్రసాదు, నవిడిబోయిన వెంకటకృష్ణ, దారం విజయకుమార్, మేడా నరసింహరావు, ఆకుల మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కోవూరుపల్లి చెరువు ఆక్రమణలను అడ్డుకోవాలి



చెరువు ఆక్రమణలపై అధికారులకు అర్జీ అందచేస్తున్న టీడీపీ నేతలు

బిట్రగుంట, ఫిబ్రవరి 9: బోగోలు మండలం కోవూరుపల్లి పంచాయతీ పరిధిలోని చెరువు ఆక్రమణలను అడ్డుకోవాలని మండల టీడీపీ నేతలు శుక్రవారం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా మండల టీడీపీ కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కోవూరుపల్లి గ్రామ చెరువులో లేఔట్ రూపంలో కొంత ఆక్రమణలకు గురైందని, అంతేకాకుండా ఇతరులు కొంత ఆక్రమించి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారన్నారు. అందువలన చెరువు విస్తరణ తగ్గిపోయి పూర్తిస్థాయిలో నీరు నిల్వ చేసుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. చెరువుపై ఆధారపడి ఉన్న ఆయకట్టు రైతులకు సాగునీరు కొరత ఏర్పడి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈమేరకు తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దారు అందుబాటులో లేకపోవడంతో సీనియర్ అసిస్టెంట్ విజయకుమారికి వినతిపత్రం అందచేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా రైతు నాయకులు కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, నాగులవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు యర్రం వెంకటేశ్వర్లురెడ్డి, మండల నాయకులు సుధీర్‌బాబు, ఎన్ రంగయ్య, ఎన్ భాస్కర్, క్రిష్ణయ్య తదితరులు ఉన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

ఉదయగిరి, ఫిబ్రవరి 9: ఉదయగిరి ప్రాంతంలో ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని సెబ్ సీఐ రామిరెడ్డి వెంకటరమణమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ శకునాలపల్లి, సమీదుపల్లి, తిరుమలాపురం తదితర గ్రామాల చెరువులు, వాగులు, వంకల నుంచి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. అలాగే పలు గ్రామాల్లో మద్యం షాపులు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించి దాడులు నిర్వహిస్తామని తెలిపారు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు : మానుగుంట



విద్యార్థినులకు షీల్డు అందచేస్తున్న ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 9: క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీగాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా క్రమశిక్షణతో మెలిగి లక్ష్యాలు చేరుకోవాలని ఉద్బోధించారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు, షీల్డులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణారావు, డైరెక్టర్ భరద్వాజ, ప్రిన్సిపాల్స్ గీతా శ్రీనివాస్, ఉషాచంద్రిక తదితరులు పాల్గొన్నారు.

అనర్హుల పేర్లు తొలగించాలి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 9: తమ అనుభవంలో ఉన్న పొలాలకు అనర్హులైన వారి పేర్లు నమోదు చేశారని, పరిశీలించి వాటిని తొలగించి న్యాయం చేయాలని శుక్రవారం మండలంలోని బండగానిపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు తహసీల్దారు నెహ్రూబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో భూముల రీ సర్వే జరిగిందన్నారు. ఆ సమయంలో రెవెన్యూ సిబ్బంది అనుభవంలో ఉన్న పలువురి రైతుల భూములకు సంబంధించి ఇతరుల పేర్లు నమోదు చేశారన్నారు. స్పందించిన తహసీల్దారు వీఆర్వోను పరిశీలన చేయాలని సూచించారు.

రైతులకు అండగా ఉంటా : ఎమ్మెల్యే



రైతులతో కలిసి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి

కావలి టౌన్, ఫిబ్రవరి 9: సొంత నిధులతో కావలి చెరువు కాలువ పనులు పూర్తిచేసి కాలువకు నీరు సమృద్ధిగా పారేవిధంగా చర్యలు తీసుకుని రైతులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే రైతులతో కలిసి కావలి పెద్ద చెరువు 2వ కాలువను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కావలి చెరువు కాలువ పూడిపోవడంతో చివరి వరకు నీరు అందడంలేదని, వారం రోజుల్లో పనులు పూర్తిచేయించి రెండవ పంటకు నీరు అందేలా కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. వెంటనే కాలువ పనులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

పసుపులేటి గెలుపునకు సమష్టి కృషి అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లు సాల్మన్ రాజు

అల్లూరు, ఫిబ్రవరి 9 : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కావలి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేయనున్న పసుపులేటి సుధాకర్ గెలుపునకు సమిష్టి కృషి అవసరమని ఎల్లు సాల్మన్ రాజు అన్నారు. అల్లూరులోని పిఎస్ఆర్ ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారందరూ పసుపులేటికి మద్దతుగా నిలిచి గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లి రమేష్, సత్యవోలు శేషారెడ్డి, గుమ్మడి రాజేష్‌బాబు, ఎల్లు సుబ్రహ్మణ్యం, కప్పల నవీన్ కుమార్, కావలి మల్లి, కాకాని రంగయ్య, కోవూరు బాబురావు, గోళ్ల హరికృష్ణ, డక్కా అక్షయ్ కుమార్ తదితరుల పాల్గొన్నారు.

మన్నేటికి ఘన సన్మానం



మన్నేటిని సన్మానిస్తున్న జనసేన పార్టీ నాయకులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 9: మండలంలోని గంగిరెడ్డిపల్లిలో మన ఫౌండేషన్ అధినేత, మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డిని శుక్రవారం కలిగిరి జనసేన పార్టీ మండల కమిటీ ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బండారు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మన్నేటి తన ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలతో పాటు ఉదయగిరి, వింజమూరు పట్టణాల్లో అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేసి పేదల ఆకలి తీరుస్తున్నా రన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కమతం శ్రీను, పొన్నం నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నాసేన కోసం.. నావంతు కమిటీ సభ్యుడిగా భోగినేని

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 9: నా సేన కోసం.. నావంతు కార్యక్రమం కమిటీ సభ్యుడిగా ఉదయగిరి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు భోగినేని కాశీరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ తనను నాసేన కోసం.. నావంతు కార్యక్రమం కమిటీ సభ్యుడిగా నియమించినందుకు పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

మృతుడి కుటుంబానికి బీమా చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఏఎస్‌పీ అహ్మద్‌హుస్సేన్

ఆత్మకూరు, ఫిబ్రవరి 9 : తపాలా బీమా చేసుకుంటే ఆపద సమయంలో అండగా ఉంటుందని ఆత్మకూరు ఏఎస్‌పీ అహ్మద్‌హుస్సేన్ తెలిపారు. పోస్టాఫీసులో పోస్టల్ ఇన్సూరెన్స్ చేసుకుని ఇటీవల మృతి చెందిన బీ. సాయిఅనిల్‌కుమార్ కుటుంబ సభ్యులకు శుక్రవారం రూ. 11 లక్షల బీమాను అందజేశారు. ఈ సందర్భంగా అహ్మద్‌హుస్సేన్ మాట్లాడుతూ సాయిఅనిల్‌రెడ్డి రెండు సంవత్సరాల క్రితం రూ 10 లక్షల తపాలా బీమా చేశారన్నారు. ఆయన మృతిచెందడంతో బోనస్‌తో కలిపి మొత్తం రూ.11 లక్షలు కుటుంబసభ్యులకు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఎం వెంకటరమణ, ఖాజావలి పాల్గొన్నారు.

విజయీభవ యాత్రలో ఎమ్మెల్యే



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మేకపాటి

మర్రిపాడు, ఫిబ్రవరి 9: డీసీపల్లి నుంచి ఆత్మకూరు మండలం వెన్నవాడకు రూ291.40లక్షలతో తారు రోడ్డు మంజూరైంది. దీంతో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శుక్రవారం శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. అనంతరం వెన్నవాడలో జరిగిన విజయీభవ యాత్రలో పాల్గొని, రైతుభరోసా, సచివాలయం, పాలవెల్లువ కేంద్రం, ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల తనిఖీ



పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

సీతారామపురం, ఫిబ్రవరి 9: మార్చిలో జరగబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సంబంధించి ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ హైస్కూల్ సెంటర్లను ఎంఈవో ఎస్‌కే. మస్తాన్‌వలి, మండల ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారుల ఆదేశాల మేరకు మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు గానూ, పరీక్షా కేంద్రాల్లో సదు పాయాలు, గదులు, సామాగ్రిని పరిశీలించామని, సీసీ కెమెరాలు సైతం ఉన్నాయా లేవా అనే విషయాన్ని ధ్రువీకరించి వివరాలను జిల్లా స్థాయి అధికారులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఎస్ఎం రెహమాన్, సీఆర్పి కులారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 9 : మునిసిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో దశల వారీగా యుద్ధప్రాతిపదికన పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజుల్లాలా తెలిపారు. ఆయన శుక్రవారం పలు ప్రాంతాల్లో చేపట్టిన పారిశుధ్యం పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మున్సిపల్ కార్యాలయంలో తాగునీటి సరఫరాపై అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మునిసిపాలిటీ పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు తమ దృష్టికి తీసుకుని వస్తే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు.

రోడ్డు భద్రతపై వ్యాసరచన పోటీలు



మాట్లాడుతున్న ఎంవీఐ రాములు

ఆత్మకూరు, ఫిబ్రవరి 9 : రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రోడ్డు భద్రత - అందరి బాధ్యత అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. మోటారు వాహనాల తనిఖీ అధికారి రాములు మాట్లాడుతూ వ్యాస రచన పోటీల్లో విజేతలైన వారికి సోమవారం ఆర్టీసీ తరఫున బహుమతులు అందజేస్తామన్నారు. 18 ఏళ్లు దాటిన వారందరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం కరీమున్నీసా, ప్రధానోపాధ్యాయురాలు అనంతలక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపండి

అనంతసాగరం, ఫిబ్రవరి 9: మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారంపై సిబ్బంది ప్రతేక శ్రద్ధ చూపాలని తహసీల్దారు నరసింహారావు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ జగనన్న గృహాల రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తి చేయాలని, భూరీసర్వే కార్యక్రమంపై దృష్టి సారించాలన్నారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను పరిశీలించి పరిష్కరించేలా దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించండి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 9: పట్టణంలో ఇటీవల చోటు చేసుకుంటున్న అసాంఘీక కార్యకలాపాలపై అధికారులు దృష్టిసారించాలని జిల్లా వైసీపీ యూత్ కార్యదర్శి షేక్ గాజుల షర్ఫుద్దీన్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాత వెలుగు కార్యాలయంలో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోవడం, సాయంత్రం సమయంలో అమ్మాయిలపై ఆకతాయిల బెడద అధికమైందన్నారు. అధికారులు ప్రత్యేక నిఘా ఉంచడడంతో పాటు ప్రధాన కూడళ్లల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న పంచాయతీ అధికారులు

కలువాయి, ఫిబ్రవరి 9: మండలంలోని తెలుగురాయపురంలో ఇళ్ల ముందు వేసిన ప్లాట్‌ఫారంలను శుక్రవారం పంచాయతీ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. పైప లైన్ లీకేజీతో వీధులు అపరిశుభ్రంగా మారాయని, వీధులు కూడా ఆక్రమణలకు గురవడంతో వీటిపై చర్యలు తీసుకోవాలని జగనన్నకు చెబుదాం కార్యక్ర మంలో గ్రామస్థులు ఫిర్యాదు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి తెలిపారు. ఇళ్ల ముందు ప్లాట్‌ఫారంలు వేయడంతో మురికినీరు వెళ్లే మార్గం లేక వీధులు అపరిశుభ్రంగా మారాయని, దీంతో దోమలు కూడా అధికమయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో ప్లాట్‌ఫారంలను తొలగించినట్లు ఆమె తెలిపారు.

సొసైటీ సభ్యులు ధ్రువపత్రాలు సమర్పించాలి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 9: మండలంలోని కమ్మవారిపల్లి సొసైటీలో రూ.300లు ఆపైన షేర్ల ధనం కలిగిన సొసైటీ సభ్యులు సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించాలని ఉదయగిరి బ్రాంచ్ సూపర్‌వైజర్ బీ.సురేంద్రరెడ్డి, సొసైటీ సీఈవో లోక్‌నాథ్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సొసైటీల రికార్డులు కంప్యూటరీకరణ చేసేందుకు నిర్ణయించారన్నారు. ఈనెల 15వ తేదీలోపు కార్యాలయంలో అందజేయాలని వారు కోరారు.

పంచాయతీ సమావేశం రసాభాస



కార్యదర్శిని నిలదీస్తున్న ఓ వర్గం వారు

వరికుంటపాడు, ఫిబ్రవరి 9: విరువూరులో శుక్రవారం పంచాయతీ సర్పంచ్ పాలకొల్లు ఉమామహేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన పంచాయతీ సమావేశం అధికారపార్టీకి చెందిన ఇరు వర్గీయుల నడుమ ఉద్రిక్తంగా మారడంతో అర్థాంతరంగా ముగిసింది. వివరాల మేరకు పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతుండగా ఓ వర్గానికి చెందిన కొంతమంది అభ్యంతరం వ్యక్తం చేశారు. కోరం లేకుండా ఆమోదిస్తున్న తీర్మాన పత్రాలను చూపించాలని పట్టుబట్టడంతో పాటు గతంలోనూ సక్రమంగా సమావేశాలు నిర్వహించలేదని నిలదీశారు. అలాగే పంచాయతీలోని ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేసేలా తీర్మానం చేయాలని పట్టుబట్టారు. దీంతో రెవెన్యూ అధికారులకు సంబంధించిన అంశాన్ని పంచాయతీ తీర్మానంలో పొందుపరిచే అవకాశం లేదని కార్యదర్శి చెబుతున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఈనేపథ్యంలో ఇరువర్గీయుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటీనా సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గీయులను సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించేశారు.

12న డయల్ యువర్ డీఎం

ఉదయగిరి, ఫిబ్రవరి 9: ఉదయగిరి ఆర్టీసీ డిపోలో ఈనెల 12వ తేదీన డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిపో పరిధిలోని అన్ని మండలాల ప్రయాణికులు తమ సూచనలను ఉదయం 11 నుంచి 12 గంటలలోపు 9959225095 నెంబర్‌కు తెలియజేయాలని కోరారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

ప్రతి విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి



పొదలకూరు : పుట్టాయగుంటలో మాత్రలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది



బుచ్చిరెడ్డిపాలెం : విద్యార్థినులకు మాత్రలు వేస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 9: ప్రతి విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.కె ఖాదర్‌వలి పేర్కొన్నారు. మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేబూరు బిట్-2 ఆదిమ్మసత్రం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్ర వారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా విద్యార్థు లకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడుతూ శుక్రవారం మాత్రలు మింగని విద్యార్థులకు ఫిబ్ర వరి 16వ తేదీన జరిగే మాప్-అప్ కార్యక్రమం రోజు మాత్రలు మింగించా లని, స్కూల్‌కు వెళ్లని విద్యార్థులకు కూడా మాత్రలు మింగించే బాధ్యత వైద్య సిబ్బంది, ఆశా వాలంటీర్లదేనని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు, శ్రావణ్‌కుమార్, జిల్లా కోఆర్డినేటర్, హెడ్మాస్టర్ కె రాజేశ్వరి, హెచ్ఓ శ్రీనివాసరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు : నులిపురుగుల నివారణ దినోత్సవంతో భాగంగా శుక్ర వారం అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో అల్ బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు డాక్టర్ కిరణ్ రిషిత, డాక్టర్ శ్రీకావ్య, ఆరోగ్య విస్తరణ అధికారి టీ. రవికుమార్ తెలిపారు. నులిపురుగులతో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి మందగించడం, తదితర సమస్యలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఏ.మస్తాన్‌బీ, ఆరోగ్య సహాయకులు ఎం.రాధాకుమారి, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ సుమాంజలి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీతోపాటు మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు అల్ బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. బుచ్చిరెడ్డిపాళెంలోని బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు మాత్రలు పంపిణీ చేశారు. డాక్టర్ మనోజ్ మాట్లాడుతూ శుక్రవారం మాత్రలు వేసుకోనివారికి ఈనెల 16న నిర్వహించే కార్యక్రమంలో మింగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ రమణబాబు, ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, ఎంఈఓ పీవీ. రత్నం, హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తులను క్షుణంగా పరిశీలించండి : కమిషనర్



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 9 : తుది ఓటర్ల జాబితా విడుదల అనంతరం అందిన ఓటరు దరఖాస్తులను స్థానిక ఎన్నికల అధికారులు క్షుణంగా పరిశీలించి ఆపై ఉన్నతాధికారులకు పంపాలని ఎన్ఎంసీ కమిషనర్ వికాస్‌మర్మత్ సూచించారు. ఎన్నికల అధికారులతో కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు దరఖాస్తులను పూర్తిస్థాయిలో విచారణ చేసిన తరువాతే ఉన్నతస్థాయికి పంపాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో అధికారులందరు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం మూలాపేట, ఫతేఖాన్‌పేట, అక్క నవారివీధి, శోధన్‌నగర్ సచివాలయాలను ఆయన ఆకస్మికం గా తనిఖీ చేశారు.

చేసిన అభివృద్ధే నారాయణను గెలిపిస్తుంది



ప్రచారంలో పాల్గొన్న శ్రీనివాసులు రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) ఫిబ్రవరి 9: మాజీ మంత్రి పొంగూరు నారాయణ మంచితనం, ఆయన చేసిన అభివృద్ధి కార్యక్రమాలే ఆయనను భారీ మెజారిటీతో గెలిపిస్తాయని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నగరంలోని 9వ డివిజన్‌లో ఆయన శుక్రవారం ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరు నగర నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరడం ఖాయమన్నారు. వైసీపీ అరాచకాలకు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. డివిజన్ ఇన్‌చార్జి కువ్వారపు బాలాజీ, నాయకులు రామగిరి సుబ్రహ్మణ్యం, పాకాల పెంచలయ్య, చెంచుకృష్ణ పాల్గొన్నారు.

కాకాణి రమణారెడ్డికి ఘన నివాళి

పొదలకూరు, ఫిబ్రవరి 9 : మండల కేంద్రంలోని సంగంరోడ్డు జంక్షన్‌లో ఉన్న తన తండ్రి కాకాణి రమణారెడ్డి విగ్రహానికి త్రై అమావాస్య సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ పొదలకూరు సమితి అధ్యక్షుడిగా కాకాణి రమణారెడ్డి వరుసగా 4సార్లు విజయం సాధించారన్నారు. అనంతరం పట్టణంలోని జమున సినిమాస్‌లో యాత్ర-2 సినిమాను వైసీపీ నాయకులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కాకాణి కుటుంబ అభిమానులు, పాల్గొన్నారు.

గిరిజనుల ఇళ్ల సమస్య పరిష్కారం



మాట్లాడుతున్న నాయకులు, అధికారులు

విడవలూరు, ఫిబ్రవరి 9: మండలంలోని వావెల గిరిజన కాలనీలో ప్రధానమంత్రి ఆవాస యోజన కింద ఇళ్లు కట్టిస్తామని ఉన్న ఇళ్లను కూల్చేశారంటూ స్థానిక గిరిజనులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు శుక్రవారం హౌసింగ్ అధికారులు, యానాదుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసీ పెంచలయ్య కాలనీలోని గిరిజనులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. హౌసింగ్ ఏఈ పెంచలయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పీఎంఏవై పథకం కింద నిరుపేదలకు ఇళ్లు కట్టించాలనే సదుద్దేశంతో గిరిజన కాలనీలోని 10 ఇళ్లను తొలగించామన్నారు. అయితే కొన్ని అనివార్య కారణాల వలన ఇళ్లు కట్టించడం ఆలస్యం అయిందని, ఈ విషయంపై జిల్లా అధికారులు స్పందించి వెంటనే ఇళ్లు కట్టించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. రానున్న ఒకటిన్నర నెలలో కాంట్రాక్టర్లచే ఇళ్లు కట్టించి గిరిజనులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యానాది సంఘం నాయకులు చెంబేటి ఉషారాణి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉదయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే కంటైనర్ నౌకలు నడిపించు!

● మంత్రి కాకాణికి మాజీ మంత్రి సోమిరెడ్డి సవాల్



మహిళలతో మాట్లాడుతున్న సోమిరెడ్డి

ముత్తుకూరు, ఫిబ్రవరి 9 : వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి దమ్ముంటే కంటైనర్ నౌకల రవాణా చేయించాలని టీడీపీ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సవాల్ విసిరారు. ముత్తుకూరులో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాకాణి దమ్ముంటే ఏపీ మ్యారీటైం బోర్డుతో మాట్లాడి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పోర్టు లైసెన్స్‌ను రద్దు చేయించాలన్నారు. గతంలో నెలకు 10 నుంచి 14 కంటైనర్ నౌకలు వచ్చేవని, ఇప్పుడు కనీసం 8 నౌకలను కృష్ణపట్నం పోర్టులో నడిపించాలని కోరారు. కేంద్ర మంత్రికి గత నెల 24న ఫిర్యాదు చేశానంటున్న కాకాణి అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను మీడియాకు చూపించాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బొమ్మి సురేంద్ర, మండల టీడీపీ అధ్యక్షులు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జునయాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు ఈపూరు మునిరెడ్డి, నాయకులు ఏడుకొండలు, కోదండయ్య, రమణయ్య, శ్యామ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసులు, శంకర్, షఫీవల్లా, రమణమ్మ పాల్గొన్నారు.

చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి



పడుగుపాడులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దినేష్‌రెడ్డి

కోవూరు, ఫిబ్రవరి 9: చంద్రబాబును రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. పడుగుపాడులోని సత్యవతి నగర్‌లో శుక్రవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టబోయే పథకాలను వివరిస్తూ ఆయన ఇంటింటికీ తిరిగి ప్రచారం చేసి కరపత్రాలను అందజేశారు. ప్రచారంలో టీడీపీ నాయకులు చెంబేటి పెంచలయ్య, సూరిశెట్టి శ్రీనివాసులు, దాసరి మురళీమోహన్, నాగరాజు, ధారా విజయబాబు, ఉయ్యూరు వేణు తదితరులు పాల్గొన్నారు. కాగా, దినేష్‌రెడ్డి నాయకత్వంలో సాలుచింతల కూడలి నుంచి చిన్నపడుగుపాడు కూడలి వరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు మోటారుబైక్‌లతో భారీ ర్యాలీ చేపట్టారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, బాలరవి, తిరుమూరు అశోక్‌రెడ్డి, నాటకరాని వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి జగన్

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట), ఫిబ్రవరి 9: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మాయమాటలు చెప్పి మోస గించారని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి ఆరోపిం చారు. నగరంలోని 52వ డివిజన్ రంగనాయకులపేట చిత్రకూటం నుంచి శుక్రవా రం జనం కోసం జనసేన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మనుక్రాంత్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఉమ్మడి జనసేన, టీడీపీ అభ్యర్థిని ప్రజలు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, నాయకులు షేక్ ఆలియా, కంతర్, సాయి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి భారీగా చేరికలు



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జానీమాస్టర్

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట), ఫిబ్రవరి 9: నగరంలోని భగత్‌సింగ్ కాలనీలో వీర మహిళా నాయకురాలు హసీనా ఆధ్వర్యంలో శుక్రవారం జనసేన పార్టీలోకి 150 మందికి పైగా చేరారు. జనసేన పార్టీ నాయకులు జానీ మాస్టర్ పార్టీలో చేరిన వారికి కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, నాయకులు వినోద్, కుక్క ప్రభాకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు టిడ్కో నివాసాల వద్ద జనసేన నిరసన

నెల్లూరు (సాంస్కృతికం): నెల్లూరు నగరంలోని వెంకటేశ్వరపురంలో ఉన్న టిడ్కో నివాసాల వద్ద శనివారం ఉదయం 11 గంటలకు నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు జనసేన నేత, కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ తెలిపారు. నెల్లూరులోని హోటల్ మినర్వా గ్రాండ్ నుంచి దాదాపు వెయ్యి మందితో ప్రదర్శనగా వెంకటేశ్వరపురంకు చేరుకుని అక్కడ నిరసన తెలపనున్నట్లు పేర్కొన్నారు. నెల్లూరులోని జర్నలిస్టు భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నాలుగున్న రేళ్లుగా లబ్ధిదారులకు ఇళ్లను ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. టిడ్కో నివాసాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారిపోయాయని ఆరోపించారు. ఆయన వెంట జనసేన నేతలు గునుకుల కిషోర్, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జొన్నవాడ ఆలయ ఈఓ బదిలీ?

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 9 : జొన్నవాడలో మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయ ఇన్చార్జి ఈవో వి. గిరికృష్ణ బదిలీ అయినట్లు సమాచారం. ఆయన స్థానంలో పెంచలకోన ఇన్చార్జి ఈఓ, కృష్ణపట్నం శివాలయం ఈఓ జనార్ధన్‌రెడ్డిని పదోన్నతిపై ఏసీగా జొన్నవాడకు బదిలీ చేసినట్లు తెలిసింది. అయితే జొన్నవాడ ఈవోగా గిరికృష్ణనే కొనసాగించాలంటూ అధికార పార్టీ నాయకులు దేవదాయ శాఖ అధికారులకు సిఫారసు చేసినట్లు సమాచారం. మరోవైపు నెల్లూరులోని రాజరాజేశ్వరి ఆలయానికి జనార్దన్‌రెడ్డిని సర్దుబాటు చేసేలా సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.

అత్యాధునిక వసతులతో 'వన్‌వరల్డ్ పేస్-2'

● నెల్లూరుకు సమీపంలో రేపు ప్రారంభం ● గ్రీన్ హోం డైరెక్టర్ హరిబాబు నాయుడు



హరిబాబునాయుడు

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 9 : నెల్లూరుకు సమీపంలో అత్యాధునిక వసతులతో 62 ఎకరాలలో రూపుదిద్దుకున్న వన్ వరల్డ్ ఫేస్-2 వెంచర్‌ను ఆదివారం ప్రారంభిస్తున్నట్లు గ్రీన్‌హోం డైరెక్టర్ హరిబాబునాయుడు చెప్పారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కస్టమర్ల అభిరుచికి అనుగుణంగా ప్లాట్లు వేయడంతోపాటు 3వేల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన విల్లాలను కట్టిస్తామన్నారు. నుడా అప్రూవల్ కలిగిన ఈ వెంచర్‌లో విశాలమైన సిమెంటు రోడ్లు, డ్రైన్లు, విద్యుత్, మంచినీటి సౌకర్యాలు ఇతర సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. అంతేగాక స్థలాలు కొనుగోలు చేసిన వారికి ఇళ్ల నిర్మాణంలో డిజైనింగ్, ఇంజనీరింగ్ సపోర్టు అందచేస్తామన్నారు. వెంచర్ చుట్టూ ప్రహరీపాటు అనునిత్యం సెక్యూరిటీ ఉంటుందన్నారు. తమ వన్‌వరల్డ్ వెంచర్‌కు ఆనుకొని జాతీయ రహదారితోపాటు అనేక విద్యాసంస్థలు, వైద్యశాలలు ఉన్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు బీవీ సాయిరాం బి.ఆనంద్‌తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(జడ్పీ), ఫిబ్రవరి 9: నగరంలోని హరనాథపురం, రామ్మూర్తి నగర్, వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ల పరిధిలో లైన్లు మరమ్మతులు చేస్తున్నందున శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ సోమశేఖర్‌రెడి ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో హరనాథపురం, ఆదిత్య నగర్, చిల్డ్రన్స్‌పార్కు, పార్థసారధినగర్, రామ్మూర్తినగర్, బాలాజీ నగర్, జేమ్స్‌గార్డన్, వెంకటేశ్వరపురం, గాంధీగిరిజన కాలనీ, రేబాల వారి వీధి, స్టోన్‌హౌస్‌పేట, ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలిపారు. అలాగే ఎన్టీఆర్ నగర్, జగదీష్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలో లైన్లు మరమ్మతులు చేస్తున్నందున మధ్యాహ్నం 2నుంచి 5 గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. ఎంజీ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8నుంచి 11గంటల వరకు , డీఆర్‌డీఏ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 7నుంచి 12వరకు, ఏకే నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8.30నుంచి 12.30 వరకు, ఆటోనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8.30 నుంచి 12.30 వరకు, ఇరుకళలమ్మ సబ్‌స్టేషన్‌పరిధిలో ఉదయం 8.30నుంచి 1.30గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామని, ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో ప్రాంతాలకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

కమనీయం కల్యాణ వేంకటేశ్వరుడి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 9 : నగరంలోని బాలాజీనగర్‌లో శుక్రవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. అన్నమయ్య సంకీర్తనలు భక్తులను మైమరిపించాయి. వికాస్ ప్రజాహిత సేవా సమితి, 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాపరెడ్డి, జ్యోతి దంపతులు ఆధ్వర్యంలో శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణానక్షత్రం సందర్భంగా 11వ కల్యాణం నిర్వహించారు. కల్యాణ వెంకటేశ్వరుడు, శ్రీదేవి భూదేవిలకు ఉదయం తిరుమంజనం, అభిషేకాలు జరిగాయి. కల్యాణానికి విచ్చేసిన భక్తుల గోత్ర నామాలతో పూజలు నిర్వహించారు. తిరుమల తిరుపతి సంప్రదాయంలో ఆంధ్ర ప్రదేశ్ అర్చన్ శిక్షణ కేంద్రం, డైరెక్టర్ డాక్టర్ ఎస్.తనూజ విష్ణువర్ధన్ కల్యాణ ఘట్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుమల బ్రహ్మోత్సవాల వ్యాఖ్యాత డాక్టర్ వైశైలజ, విశిష్ట అతిథిగా తెలంగాణ రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల, జిల్లాకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 9: ప్రజల సమస్యలు పరిష్కరించాలని దళితనేత సోదల రమణయ్య తహసీల్దారు సురేష్‌బాబు, ఎంపీడీఓ రాజ్యలక్ష్మిని కలిసి విన్నవించారు. మండలానికి కొత్తగా వచ్చిన తహసీల్దారు, ఎంపీడీఓలను రమణయ్య శుక్రవారం కలిసి సన్మానించారు. నగర పంచాయతీతోపాటు గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు, రైతుల సాదాబైనామాలు, విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 9: ఆర్టీసీ 1, 2 డిపోల పరిధిలోని బస్సులలో ప్రయాణించే ప్రయాణికులు వారి విలువైన సలహాలు, సూచనలు అందించేందుకు శనివారం డయల్ యువర్ డీఎం కార్యాక్రమం నిర్వహిస్తున్నామని డీఎంలు మురళీకృష్ణ, శివకేశవయాదవ్‌లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒకటో డిపో పరిధిలోని ప్రయాణికులు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు, రెండవ డిపో ప్రయాణికులు మధ్యాహ్నం 12 నుంచి 1 గంటల వరకు 99598 85641కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

బురాన్‌పూర్‌లో ఎన్ఎస్ఎస్ క్యాంప్

వెంకటాచలం, ఫిబ్రవరి 9: మండలంలోని చెముడుగుంట పంచాయతీ బురాన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏబీ రవికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెంచురామారావు, ఉపాధ్యాయుడు నరసింహారావు, అధ్యాపకుడు జాకీర్, తదితరులు ఉన్నారు.

స్టిక్కర్ల సీఎంకు ప్రజలు బుద్ధి చెబుతారు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 9: స్టిక్కర్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్టు రాజేశ్వరమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని దామరమడుగులో నిర్వహించిన పల్లెకుపోదాం (గావ్ చలో అభియాన్) కార్యక్రమంలో సచివాలయం, అంగన్‌వాడీ స్కూలు, హైస్కూలును సందర్శించి పలు శాఖల అధికారులు, ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. దామరమడుగులో జనసంఘ్ నుంచి పనిచేస్తున్న సీనియర్ నాయకుడు బండి సుబ్బారెడ్డిని, స్థానిక కామాక్షితాయి ఆలయ పూజారి మురళిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రఘురామయ్య, విజయశ్రీ, నాగవేణి, పెంచలప్రసాద్, కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, తదతరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

పొదలకూరు, ఫిబ్రవరి 9 : బ్యాంకు ఖాతాదారులు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పొదలకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, జడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ కోరారు. స్థానిక షాదీమంజిల్‌లో ఆర్బీఐ వారి సౌజన్యంతో పొదలకూరుకు చెందిన ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ బ్యాంకు ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యత, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ బ్యాంక్ ప్రతినిధులమంటూ అపరిచితుల నుంచి వచ్చే మెసేజ్‌లు, ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీ, డెబిట్ కార్డుల పిన్, సీవీవీ వంటి నెంబర్లు ఇతరులకు చెప్పవద్దని, అలాంటి వివరాలను ఏ బ్యాంకులు అడగవన్నారు. ట్రీస్ సేవా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు నౌరాజ్, అహ్మద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాతాదారులకు అందిస్తున్న ప్రత్యేక పథకాలు, సేవలను ఖాతాదారులకు వివరించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రోజ్‌మేరీ, పొదలకూరు సర్పంచ్ చిట్టెమ్మ, జిల్లా మైనారిటీ నాయకుడు, మాజీ కో ఆప్షన్ మెంబర్ అంజాద్, ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ కో ఆర్డినేటర్ గయాజ్, రిసోర్స్ పర్సన్స్ టీ.వెంకటేశ్వర్లు, ఏ.చంద్రశేఖర్, ఖాతాదారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రాంబాబు

ఆర్యవైశ్య పేదలకు పింఛన్ పంపిణీ



పేదలకు నగదు అందజేస్తున్న ఏఎస్పీ రాంబాబు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 9 : పేద ఆర్యవైశ్యులకు శుక్రవారం నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పింఛన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇంటెలిజెన్స్ ఏఎస్పీ రాంబాబు 70 మందికి రూ.వెయ్యి చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అమరా మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎంపీ.ఆంజనేయులు, కోశాధికారి కె.శోభన్‌బాబు, ప్రోగ్రామ్ చైర్మన్ బి.శ్రీధర్, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సోమశిల జలాశయాన్ని నేషనల్ సేఫ్టీ అధికారులు సందర్శించాలి

● డీఆర్వో లవన్నకు బీజేపీ నాయకుల వినతి



డీఆర్వోకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 9 : రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైన సోమశిల డ్యామ్‌ను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అధికారులు సందర్శించాలని కోరుతూ బీజేపీ నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ డీఆర్వో లవన్నకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల కిందట వచ్చిన వరదలకు సోమశిల డ్యామ్ ముందు భాగంలోని అప్రాన్ స్పిల్‌వే కాంక్రీట్ దిమ్మెలు, రక్షణ గోడలు దెబ్బతిన్నాయని చెప్పారు. రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ అధికారులు దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం రూ.120 కోట్లతో అప్రాన్ పనులు ప్రారంభించారన్నారు. అయితే పనులు చేసిన కాంట్రాక్టర్‌కు ఒక్క రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకపోవటంతో అర్థాంతరంగా పనులు నిలిపివేశారన్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ డ్యాంలను పరిశీలిస్తున్న నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ సభ్యులు సోమశిల డ్యాంను కూడా పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చి డ్యాం పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాసరి రాజేంద్రప్రసాద్, మారం కృష్ణ, కంచర్ల నారాయణయాదవ్, రఘురామయ్య, బి.నారాయణరావు, బెల్లంకొండ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 9: మండలంలోని రామచంద్రాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 2024-25 సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కే జయలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 23వ తేదీ వరకు అవకాశం ఉందని, 5వ తరగతిలో ప్రవేశానికి సొంత జిల్లా వారు మాత్రమే అర్హులని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2022-23, 2023-24 విద్యా సంవత్సరాలలో3, 4 తరగతులు చదివిన విద్యార్థినులు, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి 2023-24 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షలు రాస్తున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తికలిగిన వారు ఆన్‌లైన్‌లో, లేదా దగ్గరలో వున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, లేక రామచంద్రాపురంలోని గురుకులంను సంప్రదించాలని తెలిపారు.

వైభవంగా కామాక్షితాయి నిత్య కల్యాణోత్సవం



ఊరేగింపులో స్వామి అమ్మవారు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 9: మండలంలోని జొన్నవాడ ఆలయంలో శుక్రవారం ఉదయం గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామి నిత్య కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ పురోహితులు శ్రీధర్‌స్వామి స్వామి, అమ్మవార్లకు నిత్యకల్యాణం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తికి సామూహిక కుంకుమార్చన చేసి అనంతరం పల్లకి సేవలు నిర్వహించారు. ఆలయ ఏసీ, ఈఓ వి గిరికృష్ణ పర్యవేక్షించారు.

పీవీకీ భారతరత్న తెలుగువారికి గర్వకారణం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 9 : మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారత ఇవ్వడం తెలుగువారికి గర్వకారణమని టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్ ఒక ప్రకటనలో తెలిపారు. పీవీ తన జీవితాంతం ప్రజా సంక్షేమం కోసమే పరితపించారని తెలిపారు. దేశంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టి ప్రపంచ పటంలో దేశానికి గుర్తింపు తెచ్చిన వ్యక్తి పీవీ నరసింహారావు అని కొనియాడారు.

● **తెలుగుజాతి కీర్తిరత్న పీవీ**

తెలుగుజాతి ముద్దుబిడ్డ పీవీ నరసింహారావుకు భారతరత్న దక్కడం తెలుగుజాతికి కీర్తిరత్నగా నిలిచిపోయారని సింహపురి ధార్మిక సంస్థ వ్యవస్థాపకుడు ఉచ్చి భువనేశ్వరీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగుజాతిలో మొట్టమొదటి భారతరత్న దక్కడం వారి ప్రతిభకు నిదర్శనమన్నారు. బహు భాషా కోవిదుడు, రాజనీతి స్థితప్రజ్ఞుడు, పరిపాలనాదక్షుడు, సాహితీవేత్త, విశిష్టతకు భారతరత్న ప్రదానం చేసినందుకు కేంద్ర ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.

ఐటీఐతో సమాతరంగా ఇంటర్



పాల్గొన్న ప్రభుత్వ విద్యార్థులు

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 9 : ఐటీఐ కోర్సుతో పాటు సమాతరంగా ఇంటర్మీడియట్‌ను పూర్తి చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని కొత్తూరు వద్దనున్న ఆర్ఎస్ఆర్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రెహమాన్ తెలిపారు. శుక్రవారం ఆ కళాశాల ప్రాంగణంలో ప్రభుత్వ విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐటీఐ ట్రేడ్ కోర్సుల్లోని మూడు సబ్జెక్టుల ప్రతిభను ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ కోర్సుల్లోకి బదలాయించుకునే అవకాశం ఉందన్నారు. కేవలం ఆంగ్లం, ఇరత ప్రధాన గ్రూపుల్లో సబ్జెక్టును ఎంపిక చేసుకుని ఉత్తీర్ణత పొందితే మిగిలిన ఐదు సబ్జెక్టుల్లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత పత్రాన్ని పొందవచ్చాన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యేతో సీపీఎం నాయకుల భేటీ



ఎమ్మెల్యేని సన్మానిస్తున్న సీపీఎం నేతలు


నెల్లూరురూరల్, ఫిబ్రవరి 9: నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కనుపర్తిపాడుకు చెందిన సీపీఎం నాయకులు బీమతాటి సుధాకర్, సుధీర్‌లు శుక్రవారం నెల్లూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిస్థితులపై ఏకాంతంగా మాట్లాడుకున్నారు. అనంతరం టీడీపీ నేత గిరిధర్‌రెడ్డితోనూ భేటీ అయ్యారు. కాగా 21వ డివిజన్‌లో ఎమ్మెల్యే సతీమణి సుజిత ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన కృష్ణమోహన్‌రెడ్డి టీడీపీలో చేరారు. స్థానిక డివిజన్ పర్యటనలో భాగంగా ఆయనకు ఆమె పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

కుట్టు మిషన్ల పంపిణీ


వెంకటాచలం, ఫిబ్రవరి 9 : మండలంలోని చవటపాళెంలో శుక్రవారం ఎస్సీ ఎస్టీ, బీసీలకు స్పీచ్ సేవా సంస్థ సహకారంతో, రీడ్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పీచ్ సేవా సంస్థ అధ్యక్షుడు కే శ్రీనివాసులు, రీడ్స్ సేవా సంస్థ అధ్యక్షుడు ఆరుముళ్ల మురళీ, తదితరులు పాల్గొన్నారు.

తూర్పుపూండ్లలో జగనన్న ఆరోగ్య సురక్ష

సైదాపురం, ఫిబ్రవరి 9: మండలంలోని రామసాగరం పంచాయతీ తూర్పుపూండ్ల గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్, ఏవో పురుషోత్తం శివకుమార్, డాక్టర్ జనార్ధన్, సర్పంచ్ ముత్తుకూరు వెంకట రత్నమ్మ, వైద్య సిబ్బంది. సచివాలయం కార్యదర్శి నరేంద్ర, వీఆర్వో సుబ్బయ్య పాల్గొన్నారు.




శరణు.. శరణు.. చెంగన్నా!



ది గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్‌లో ... ది గ్రాండ్ ఓల్డ్ పొలిటీషియన్‌గా పేరున్న మాజీ మంత్రి చెంగారెడ్డిని నగరి ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా తరచూ ఏదో ఒక సందర్భం పేరుతో కలుస్తుండడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. జనవరి 13న జన్మదినం సందర్భంగా నగరిలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో చెంగారెడ్డిని కలిసి రోజా శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఐదేళ్లలో అంతకు మునుపు ఏ పుట్టినరోజునా ఆమె ఇలా కలవలేదు. రెండు రోజుల కిందట మళ్లీ ఆయనను కలిసి నగరిలోని దేశమ్మ ఆలయ కుంభాభిషేకానికి ఆహ్వానించారు. 2014 సార్వత్రిక ఎన్నికల తరువాత ఒకరకంగా అస్త్రసన్యాసం చేసిన చెంగారెడ్డి మీద హఠాత్తుగా ఎన్నికల ఏడాది మాత్రమే ఈ గౌరవాభిమానాలు ప్రకటించడం వెనుక ఏముందనే చర్చ నడుస్తోంది. నియోజకవర్గవ్యాప్తంగా ఎలా ఉన్నప్పటికీ ప్రధానంగా సొంత మండలం నిండ్రలో చెంగారెడ్డిని అభిమానించే నాయకులు, కార్యకర్తలు ఇప్పటికీ ఉన్నారు. అలాగే నిండ్ర మండలంపై చెంగారెడ్డి అన్న కుమారుడు శ్రీశైలం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌గా ఉన్న రెడ్డివారి చక్రపాణిరెడ్డికి బలమైన పట్టుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో మొత్తం 7 ఎంపీటీసీలకు గాను ఐదింట చక్రపాణిరెడ్డి మద్దతుదారులు వైసీపీ తరఫున పోటీ చేసి గెలిచారు. నిండ్ర జడ్పీటీసీ మల్లీశ్వరి కూడా చక్రపాణిరెడ్డి వర్గమే. అయితే చక్రపాణిరెడ్డి వైసీపీలోనే ఉన్నా రోజాకు బద్ధ వ్యతిరేకిగా ఉన్నారు. నిండ్ర ఎంపీపీ కాకుండా తన తమ్ముడు భాస్కర రెడ్డిని రోజా అడ్డుకున్న తీరు ఆయనలో తీవ్ర వ్యతిరేకతను పెంచింది. అన్న చెంగారెడ్డితో అంటీముట్టనట్టుగా వుండిన చక్రపాణిరెడ్డి మంత్రి రోజాతో విభేదాల తర్వాత ఆయనతో సంబంధాలను పునరుద్ధరించుకున్నారు. ఎంపీపీ ఎన్నిక తర్వాత రెడ్డివారి కుటుంబం రోజాకు వ్యతిరేకంగా మారింది. ఈ నేపథ్యంలోనే నిండ్ర మండలంలో చక్రపాణిరెడ్డి పట్టును సడలించాలంటే చెంగారెడ్డిని ప్రసన్నం చేసుకోవడం తప్ప మరో మార్గం లేదనే అభిప్రాయానికి వచ్చిన మంత్రి రోజా తరచూ ఆయనను కలిసి ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

- పుత్తూరు అర్బన్

రక్తపుబొట్ల రాజకీయం




తిరుపతిలో రక్తపుబొట్ల రాజకీయం నడుస్తోంది. 'నా చివరి రక్తపు బొట్టు వరకు మీకోసమే పనిచేస్తా' అంటూ నేతలు వీరోచిత వాగ్దానాలు చేస్తున్నారు. అది కార్మికుల సమావేశమైనా, క్యాడర్‌తో మీటింగ్ అయినా నెత్తుటి బొట్టు మాట మార్చకుండా ఉపన్యాసం ముగియడం లేదు.వైసీపీ నాయకులైతే రోజుకు ఐదారు ఆత్మీయ సమ్మేళనాల్లో ఉపన్యాసాలు దంచుతున్నారు. టీడీపీ అభ్యర్థి ఎవరో తేలకపోవడంతో వారు మాత్రం ఈ జోరులో వెనుకబడిపోయారు. వైసీపీ నేతలు మాత్రం సన్నిహితులు, మద్దతుదారులు, క్యాడర్ సహాయంతో కుల సంఘాలు, వృత్తి సమూహాలను ఏకంచేసి ఆత్మీయ సమావేశాలు ఏర్పాటుచేస్తున్నారు. ప్రత్యేక 'విందు'ను అందజేస్తున్నారు. పదిమంది పనిచేసే వ్యాపార సంస్థలనూ వదిలిపెట్టడంలేదు. అసంతృప్తిగా ఉన్న కార్యకర్తలను గుర్తించి విందుకు పిలుస్తున్నారు. గొంతెమ్మ కోర్కెలు కోరేవారిని రెండు నెలలు ఓపిక పట్టమని భుజం తడుతున్నారు. దోబీ ఘాట్‌లోని శ్రీనివాస రజక యువజన సంఘం ఆత్మీయ సమావేశం, ఎమ్మార్‌పల్లిలో ఎస్వీ యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగుల యూనియన్ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం, ఎన్ఎస్ఎస్ బెస్ట్ వలంటీర్లతో ఆత్మీయ సమ్మేళనం, స్థానిక డీపీఆర్ కల్యాణ మండపంలో మహిళలతో ఆత్మీయ సమావేశం, ఇంకా పురోహితులు, చెవులు కుట్టు, వాయిద్య కళాకారుల సంఘాలతో సమావేశం, బలిజ సంఘంతో ఆత్మీయ విందు...ఇలా ఉదయం నుంచి రాత్రి 8 గంటల దాకా ఆత్మీయంగా సమావేశాలు జరిగాయి. ప్రతి సమావేశంలోనూ చివరి రక్తపుబొట్టు మాట మాత్రం మరవడం లేదు.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

మరో వికెట్ అవుట్

- డూప్లికేట్ ఓటరు కార్డుల వ్యవహారంలో తిరుపతి మున్సిపల్ పూర్వ డీసీపై వేటు
- ఈసీ నియమించకనే ఈఆర్వోగా వ్యవహరించిన చంద్రమౌళీశ్వరరెడ్డి
- ఈసీ విచారణలో వెలుగు చూసిన వైనం

తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో డూప్లికేట్ ఓటరు కార్డులు సృష్టించిన వ్యవహారంలో నాలుగో వికెట్ పడింది. తిరుపతి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తూ ఇటీవలే బదిలీపై వెళ్ళిన చంద్రమౌళీశ్వరరెడ్డి మీద డూప్లికేట్ ఓటరు కార్డుల వ్యవహారంలో ఎన్నికల కమిషన్ సస్పెన్షన్ వేటు వేసింది. 2021 మార్చి, ఏప్రిల్ నెలల్లో జరిగిన తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నికల సందర్భంగా చంద్రమౌళీశ్వరరెడ్డి ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను ఉల్లంఘించి అడ్డగోలుగా వ్యవహరించారని తేలడంతో ఎన్నికల కమిషన్ ఈ చర్యలు తీసుకుంది. కాగా తిరుపతి ఉప ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై విచారణలో భాగంగా అప్పటి మున్సిపల్ కమిషనర్, అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీశాతో మొదలైన సస్పెన్షన్ల పరంపరలో ఈయన నాలుగో వ్యక్తి.



తిరుపతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఉప ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న అక్రమాలు ఒకటొకటే ఇపుడు వెలుగు చూస్తున్నాయి. ఎన్నికల కమిషన్ విచారణలో విస్తుపోయే వాస్తవాలు తెలుస్తున్నాయి. అందులో కీలకమైంది ఎన్నికల కమిషన్ నియమించకుండానే చంద్రమౌళీశ్వరరెడ్డి ఈఆర్వోగా వ్యవహరించడం. లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్ నిజానికి ఆయనను తిరుపతి పార్లమెంటు నియోజకవర్గానికి ఏఆర్వోగా, తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఆర్వోగా నియమించింది. ఆ మేరకు 2021 మార్చి 17న గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ అయింది. అంతే తప్ప తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఈఆర్వోగా (ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్) ఆయన్ను నియమిస్తూ ఎన్నికల కమిషన్ నోటిపై చేయలేదు. అయినా కూడా అయన తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఈఆర్వోగా కూడా పనిచేశారు. ఆ హోదాలో ఆయన పేరు, ఫోన్ నంబరు ఈఆర్వో ప్రొఫైల్‌లో నమోదు కావడాన్ని బట్టి ఓటరు కార్డుల డౌన్‌లోడ్‌కు సంబంధించిన అక్రమాలకు ఆయన్ను బాధ్యుడిగా ఎన్నికల కమిషన్ పరిగణిస్తోంది. ఎలాంటి క్లైమ్ ఫామ్‌లూ అందకుండానే సుమారు 35 వేల ఓటరు కార్డులను డౌన్‌లోడ్ చేసిన వ్యవహారంలో ఇతడి పాత్రను పోలీసు దర్యాప్తులో నిర్ధారించాల్సి వుందని ఎన్నికల కమిషన్ ఇతని సస్పెన్షన్ ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల అక్రమాలకు అప్పటి తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్ ఆర్వోగా వ్యవహరించిన నాటి మున్సిపల్ కమిషనర్, ఇటీవల వరకూ అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన గిరీశా తొలుత చర్యలకు గురయ్యారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన ఈసీ ఆయనపై గత నెలలో సస్పెన్షన్ వేటు వేసింది. ఆపై వారం రోజులకే నాటి తిరుపతి అర్బన్ తహసిల్దారు, ఎలక్షన్ డిప్యూటీ తహసిల్దార్లను సైతం సస్పెండ్ చేసింది. అప్పట్లో ఆ కార్యాలయంలో పనిచేసిన కంప్యూటర్ ఆపరేటర్లు ముగ్గురిని కూడా విధుల నుంచీ తొలగించారు. మరోవైపు తిరుపతి సెగ్మెంట్ ఈఆర్వో నెట్ నుంచీ 35 వేల ఓటరు కార్డులు డౌన్ లోడ్ చేసిన వ్యవహారంపై ఈస్ట్ పోలీస్ స్టేషన్, వెస్ట్ పోలీస్ స్టేషన్‌లలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వీటిపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసుల విచారణ ఇంకా ఒక కొలిక్కి రాకముందే చంద్రమౌళీశ్వరరెడ్డిని శుక్రవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మిగిలిన వారి కంటే ఈయన వ్యవహారం భిన్నంగా మారింది. అక్రమంగా ఓటరు కార్డులు డౌన్‌లోడ్ చేసిన ఆరోపణలను ఎదుర్కోవడం ఒక ఎత్తయితే అసలు ఎన్నికల కమిషన్ నియమించకుండానే తనకు తానుగా ఈఆర్వోగా బాధ్యతలు నిర్వహించడమనేది అంతకు మించిన తప్పుగా మారుతోంది. దీంతో ఆయన ఈ వ్యవహారం నుంచీ బయటపడడం మిగిలిన అధికారుల కంటే కష్టమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కడప జిల్లాకు చెందిన ఈ అధికారికి ఇతరత్రా నిజాయితీపరుడనే పేరుంది. అయితే అధికారిగా ప్రజాప్రతినిధుల ఒత్తిడికి సులువుగా తలొగ్గుతారని, వారు చెప్పిన పనులు నిబంధనలకు విరుద్ధంగా వున్నా సరే తూచ తప్పకుండా పాటించి అమలు చేస్తారన్న పేరుంది. దానివల్ల వచ్చే పరిణామాలకు అయనే బాధ్యుడవుతుండగా ఇతర అధికారుల తరహాలో అక్రమార్జనకు పాల్పడడం వంటి ఆరోపణలు లేకపోవడం గమనార్హం.దీంతో సస్పెన్షనకు గురైన చంద్రమౌళీశ్వరరెడ్డిపై అధికార, ఉద్యోగ వర్గాల నుంచీ సానుభూతి వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఆయన బదిలీపై విజయవాడలో మెప్మా డైరెక్టరేట్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ విషయమలా వుంచితే ఈసీ తదుపరి చర్యలు ఎవరి మెడకు చుట్టుకుంటాయోనన్న భయం సంబంధిత అధికారులను, ఉద్యోగులను వెంటాడుతోంది. ఓవైపు పోలీసుల దర్యాప్తు కొనసాగుతుండగా అందులో ఏమి తేలుతుందో, ఎవరెవరు జైలుపాలు కావాల్సి వస్తోందోనని ఈ వ్యవహారంలో పాలుపంచుకున్న అధికారులు, ఉద్యోగులు హడలిపోతున్నారు.



బతికున్నా ఓటరుగా చంపేశారు!


చనిపోయినా ఓటరు జాబితాలో కొనసాగుతున్న మోహనాచారి, షణ్ముగం, సుబ్బయ్యశెట్టి, జమున, శంకర్‌రెడ్డి, చెంగారెడ్డి, ప్రమీల, పళని

- కొంతమంది చనిపోయినా ఓటరు జాబితాలో బతికేస్తున్నారు

తిరుచానూరు, ఫిబ్రవరి 9 : చంద్రగిరి నియోజకవర్గ ఓటర్ల జాబితాలో తప్పులు వెలుగులోకి వస్తూనే వున్నాయి.చనిపోయిన చాలామంది ఓటరు జాబితాలో కొనసాగుతుంటే బతికున్న కొంత మంది ఓట్లను తొలగించేశారు.తిరుపతి రూరల్ మండలంలోని తిరుచానూరు, గాంధీపురం, పాడిపేట, పద్మావతిపురం, అవిలాలతో పాటు చంద్రగిరి మండలంలో ఒక్కో పోలింగ్ కేంద్రంలో సుమారు 20నుంచి 40 వరకు చనిపోయిన వారు ఓటర్లుగా కొనసాగుతున్నారు.పాకాల,చిన్నగొట్టిగల్లు, ఎర్రా వారిపాళెం, రామచంద్రాపురం మండలాల్లో సైతం ఇలాగే వున్నట్లు టీడీపీ నేతలు వాపోతున్నారు. తిరుచానూరులోని పోలింగ్‌కేంద్రం 292లో సుమారు 19మంది చనిపోయిన ఓటర్లు జాబితాలో కొనసాగుతుండడం గమనార్హం.మాజీ ఉప సర్పంచ్ జమునతో పాటు షణ్ముగం, శంకర్‌రెడ్డి, చెంగారెడ్డి, సుబ్బయ్యశెట్టి తదితరులు మరణించి రెండేళ్లు దాటుతున్నా జాబితాలో ఓటర్లుగానే కొనసాగుతున్నారు. పోలింగ్‌కేంద్రం 277లో పళని, మోహనాచారి చనిపోయి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ఓటర్లుగా కొనసాగుతున్నారు. పాకాలలోని 94వ పోలింగ్ కేంద్ర పరిధిలో ప్రమీల రెండేళ్ల క్రితం మరణించినా ఓటరు జాబితాలో కొనసాగుతోంది.

ఎమ్మెల్యే చెవిరెడ్డి తండ్రి, తమ్ముడు మరణించినా జాబితాలో కంటిన్యూ

ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి తండ్రి సి.సుబ్రహ్మణ్యం రెడ్డి, తమ్ముడు సి.హనుమంతరెడ్డి మరణించి ఒకటిన్నర సంవత్సరం గడుస్తున్నా ఓటర్ల జాబితాలో తొలగించలేదు. ఎమ్మెల్యే సమీప బంధువులు సిద్ధప్ప, శకుంతల, రవికుమార్‌రెడ్డి మరణించినా ఓటర్లు జాబితా నుంచి ఇంకా తొలగించలేదు.ఇలా తుమ్మలగుంటలోనే పదుల సంఖ్యలో మృతి చెందిన వారి ఓట్లను తొలగించలేదని క్షేత్రస్థాయిలో పరిశీలించిన టీడీపీ నాయకులు చెబుతున్నారు.



ఓటరు జాబితాలో కొనసాగుతున్న చెవిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, హనుమంత రెడ్డి

మేమేం పాపం చేశాం?



సురేష్



విజయలక్ష్మి

తిరుచానూరుకు చెందిన సురేష్ (పోలింగ్ కేంద్రం 277లో-ఎపిక్‌నెంబరు:ఐఏఎక్స్1277137)తన ఓటును జాబితా నుంచి తొలగించడం చూసి ఆశ్చర్యపోతున్నారు. ఇదే పోలింగ్ కేంద్రానికి చెందిన విజయలక్ష్మి(ఐఏఎక్స్ 1221340) తన ఇంటికి పరిశీలనకు రాకనే చనిపోయానని ఓటర్ల జాబితాలో తొలగించడం ఎంత వరకు న్యాయమని వాపోతున్నారు. కలెక్టర్ అయినా స్పందించి తమ పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చాలని కోరుతున్నారు. లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో ఓటింగ్ శాతంపై ఈ దొంగ ఓట్ల ప్రభావం ఉంటుందని టీడీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితా విడుదల చేసిన తరువాత ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద జాబితాను ప్రదర్శించాల్సి వుంది. అయితే చంద్రగిరి నియోజకవర్గంలో అలాంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు.దీంతో తమ ఓటు పరిశీలించుకునే అవకాశం లేకుండా పోతోందని జనం వాపోతున్నారు.

విహార యాత్రలో విషాదం

- సద్దికూడు మడుగులో తమిళ యువకుడి గల్లంతు



నాగలాపురం, ఫిబ్రవరి 9:విహార యాత్రకోసం మిత్రులతో కలసి వచ్చిన ఓ తమిళ యువకుడు గల్లంతయ్యాడు.పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం కుంద్రత్తూకు మండలంలోని కొవ్వూరుకు చెందిన శ్యామ్(20) చెన్నైలోని ఎస్ఆర్ఎం డిగ్రీ కళాశాలలో బీకాం మూడవ సంవత్సరం చదువుతున్నాడు. సెలవులివ్వడంతో తొమ్మిదిమంది స్నేహితులతో కలిసి గురువారం ద్విచక్ర వాహనాలపై విహార యాత్ర కోసం నాగలాపురం మండలంలోని సద్దికూడు మడుగు చేరుకున్నాడు. సాయంత్రం వరకు అక్కడే ఉల్లాసంగా గడిపిన శ్యామ్ నీటిలోకి దిగాడు. మడుగులో నీటి ప్రవాహం ఉధ్రుతంగా ఉండడంతో గల్లంతయ్యాడు. వెంటనే స్నేహితులు నాగలాపురం పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ ఓబయ్య సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అర్ధరాత్రి వరకు యువకుడి ఆచూకీ కనిపించకపోవడంతో పోలీసులు వెనుదిరిగారు.శుక్రవారం ఉదయమే సత్యవేడు అగ్నిమాపక సిబ్బందితో కలిసి పోలీసులు మడుగు వద్దకు చేరుకున్నారు. రోజంతా ప్రయత్నించినా శ్యామ్ మృతదేహం ఆచూకి లభ్యం కాలేదు. మడుగు ప్రాంతం విస్తీర్ణం తక్కువగా ఉండి చాలా లోతుగా ఉండడంతో మృతదేహాన్ని వెలికితీయడం కష్టంగా మారింది. చీకటి పడడంతో పోలీసులు, అగ్నిమాపక దళం వెనుదిరిగారు. శనివారం మరలా గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు. శ్యామ్ ఆచూకి లభ్యం కాకపోవడంతో అతడి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. శ్యామ్ ఈ జలపాతానికి రావడం మూడోసారని అతని స్నేహితులు తెలిపారు.



సద్దికూడు మడుగు వద్ద అగ్నిమాపక దళం, పోలీసులు - గల్లంతయిన శ్యామ్ (ఫైల్‌ఫొటో)

అయ్యయ్యో.. పదవి ఉన్నా పవరు పాయెనే!

ఇంకా పదవుల్లోనే ఉన్నా పాపం ఆ ఎమ్మెల్యేలు ఇద్దరూ అధికారిక కార్యక్రమాల్లో కనిపించడం లేదు. వారి స్థానంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జులుగా ప్రకటించిన నాయకులు ఆ కార్యక్రమాల్లో పాల్గొంటూ సందడి చేస్తున్నారు. చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి నెలకొని ఉంది. చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో శుక్రవారం నాలుగో విడత ఆసరా పథకం డబ్బుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జాడ లేదు. కానీ, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి ముఖ్య అతిథిగా వచ్చారు. మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి, కమిషనరు అరుణ, మెప్మా పీడీ రాధమ్మ తదితర అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి గౌరవ మర్యాదలు చేయడం మరీ విశేషం. గతేడాది ఏప్రిల్ 3న ఇదే నాగయ్య కళాక్షేత్రంలో గుడిపాల మండలానికి చెందిన ఆసరా కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నెల నుంచి నియోజకవర్గంలో అన్ని కార్యక్రమాల్లోనూ ఇదే తంతు సాగుతోంది. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ అనే హోదా ఉండడంతో ప్రొటోకాల్ గొడవ కూడా లేదు. ఇక పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తనకు టికెట్ లేదని తెలిసినప్పుడు వైసీపీ అధిష్ఠానంపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసి, రెండు రోజులకు మాట మార్చినా.. ఆయన స్థానంలో వైసీపీ అధిష్ఠానం మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌ను ప్రకటించింది. అప్పటి నుంచి ఎంఎస్ బాబు నియోజకవర్గంలో కనిపించకుండా పోయారు. శుక్రవారం బంగారుపాళ్యంలోని కామరాజు గెస్ట్‌హౌస్‌లో అధికారిక హోదా లేకపోయినా వలంటీర్లతో సునీల్‌కుమార్ సమావేశమయ్యారు కూడా. ఈ సమావేశానికి కచ్చితంగా హాజరవ్వాలని మండల అధికారులు వలంటీర్లను ఆదేశించడం విశేషం.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



చిత్తూరులో నిర్వహించిన ఆసరా కార్యక్రమంలో వైసీపీ ఇన్‌ఛార్జి విజయానందరెడ్డి



బంగారుపాళ్యంలో నిర్వహించిన వలంటీర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ ఇన్‌ఛార్జి సునీల్‌కుమార్

నేటినుంచి శ్రీకాళహస్తిలో వైజ్ఞానిక ప్రదర్శన

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9: జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శన శనివారం నుంచి శ్రీకాళహస్తిలో రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్ తెలిపారు.శ్రీకాళహస్తిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీకాళహస్తి ఆర్బీఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న ఇన్‌స్పైర్ మనక్ వైజ్ఞానిక మేళాలో వివిధ మండలాల నుంచి 380 నమూనాలు ప్రదర్శనకు రానున్నట్లు చెప్పారు. ఇందులో 10శాతం ఎగ్జిబిట్స్ ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. రెండు రోజులపాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొనే విద్యార్థులకు భోజనం, వసతి సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు డీఎస్‌వో పేర్కొన్నారు.సమగ్ర శిక్ష సీఎంవో సురేష్, ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, భాస్కర్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో మహిళలకు రక్షణ కరువు



కరపత్రాలను అందజేస్తున్న పాశిం సంధ్యారాణి

గూడూరు, ఫిబ్రవరి 9: వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీ హైస్కూల్ రోడ్డు, సనత్ నగర్ ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో నిరుద్యోగులుగా మారిపోయారని అన్నారు. టీడీపీని గెలిపిస్తే ప్రజలకు అమలు చేయనున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో నరసింహులు నాయుడు, చంద్రమౌళి, మోహన్, శ్రీధర్, రమేష్, రత్నం, పులిమి శ్రీనివాసులు, రవీంద్రరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మట్టం శ్రావణి, భారతి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు

పెళ్లకూరు, ఫిబ్రవరి 9: మండలంలోని శిరసనంబేడులో సిద్ధేశ్వరస్వామి, రోసనూరులో భూపతేశ్వరస్వామి కొండల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. అధికార పార్టీ నేతలు నాయుడుపేట నుంచి రేణిగుంట వరకు నిర్మిస్తున్న ఎక్స్‌ప్రెస్ హైవే ముసుగులో విచ్చలవిడిగా లేఅవుట్లు, మేనకూరు పారిశ్రామికవాడలోని పలు పరిశ్రమలకు గ్రావెల్ తరలిస్తున్నారు. అలాగే ఇసుక అక్రమంగా తరలించేస్తున్నారు. ముమ్మారెడ్డిగుంట నుంచి తాళ్వాయిపాడు వరకు సుమారు 18 కిలోమీటర్ల మేర స్వర్ణముఖినది తీర ప్రాంతం విస్తరించి ఉంది. ఆయా ప్రాంతాల్లో నాణ్యమైన ఇసుక లభిస్తోంది. పెళ్లకూరులోని ఓ స్తంభాల తయారీ పరిశ్రమకు చిల్లకూరు నుంచి ఇసుకను అక్రమంగా తరలించేస్తున్నారు.

గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్ల స్వాధీనం

ఓజిలి, ఫిబ్రవరి 9: మండలంలోని ముమ్మాయిపాలెంలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లను శుక్రవారం పోలీసులు అడ్డుకున్నారు. గ్రావెల్ అక్రమ తరలింపుపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందింది. తహసీల్దారు నాంచారయ్య ఆదేశాల మేరకు ఎస్ఐ రవిబాబు సిబ్బందితో దాడులు జరిపారు. గ్రావెల్ తవ్వుతున్న ఎక్స్‌కవేటర్ డ్రైవర్ వాహనంతో పరారు కాగా, రెండు టిప్పర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో డిప్యూటీ ఈవో శివప్రకాష్‌రెడ్డి

గూడూరు, ఫిబ్రవరి 9: క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం పెరుగుతుందని డిప్యూటీ ఈవో శివప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కబడ్డీ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు కాంచన, రఫూఫ్, ఇన్‌చార్జీ హెచ్‌ఎం వరప్రసాద్, పీడీ శివకుమార్, సంస్థ సభ్యులు హరికృష్ణ, సుమంత్, లత, మౌనేంద్ర, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కోట, ఫిబ్రవరి 9: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దారు నాగరాజరావు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. బీఎల్‌వోలు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో ఆర్ఐ ప్రసాద్, సెక్టార్ అధికారులు నయీమ్, మునికుమారి, దీప, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

యువత ఓటు హక్కు వినియోగించుకోవాలి

గూడూరు, ఫిబ్రవరి 9: యువత ఓటు హక్కును వినియోగించుకోవాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక రెండో పట్టణ పరిధిలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీజేవైఎం ఆధ్వర్యంలో ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్‌రెడ్డి, శంకర్, చైతన్య, ప్రదీప్, నవీన్, కిరణ్, రోషన్, సాయి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు కేటాయించండి

కోట, ఫిబ్రవరి 9: గూడలి పంచాయతీలోని కొండమిట్ట, పాల డెయిరీ సమీపంలో ఉన్న గిరిజన కుటుంబాలకు ఇంటి స్థలాలు కేటాయించాలని శుక్రవారం ఉప సర్పంచు పల్లెమల్లు విజయసారథిరెడ్డి శుక్రవారం తహసీల్దారు నాగరాజరావుకు వినతిపత్రం అందజేశారు.

నారాయణ కార్యాలయాలపై పోలీసుల దాడులు దారుణం: నెలవల

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 9: మాజీ మంత్రి నారాయణ కార్యాలయాలపై పోలీసులు దాడులు చేయడం దారుణమని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. వైసీపీలో ఎంతో మంది పారిశ్రామికవేత్తలు, కోటీశ్వరులు ఉన్నారని, వారందరిని వదిలి నెల్లూరులోని నారాయణ కార్యాలయాలపై పోలీసులు దాడులు నిర్వహించడం సబబుకాదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలంతా గమనిస్తున్నారని, వైసీపీకి గుణపాఠం చెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు.

క్రీడాకారులకు నగదు బహుమతులు



టెన్నికాయిట్ క్రీడకారులను అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

గూడూరు, ఫిబ్రవరి 9: జాతీయ, రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ క్రీడల్లో ప్రతిభ చాటిన కొండాగుంట, సైదాపురం, విందూరు ఉన్నత పాఠశాలల క్రీడాకారులకు టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి నెల్లూరు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ మాట్లాడుతూ ఏటా మండల, డివిజన్, జిల్లాస్థాయి టెన్నికాయిట్ పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిభచాటిన క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక మినీగురుకులంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, భాస్కర్, కరిముల్లా, నాగూరమ్మ, మేరీ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 9: సూళ్లూరుపేట వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శుక్రవారం మండల పరిధిలోని అట్టకానితిప్ప గ్రామంలో పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పరిసరాల శుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి గ్రామంలో మొక్కలనాటారు. కార్యక్రమంలో సర్పంచు నాగమణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఏడుకొండలు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేవతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న బైక్: యువకుడి మృతి

తడ, ఫిబ్రవరి 9: ముందు వెళ్తున్న లారీని ఓ బైక్ వేగంగా వచ్చి ఢీకొట్టిన ఘటనలో యువకుడు మృతి చెందాడు. తమిళనాడు గుమ్మిడిపూడి తాలూకా రాఘవరెడ్డి మేడు గ్రామానికి చెందిన ఎం.జ్యోడిస్(18) గురువారం అర్ధరాత్రి కొండూరులో ఉంటున్న తన బంధువుల ఇంటికి బైక్‌పై బయలుదేరాడు. బోడిలింగాలపాడు మలుపువద్ద వేగంగా వెళుతూ అదుపుతప్పి ముందు వెళ్తున్న లారీని బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో జ్యోడిస్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ ఇద్దరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 9: నాయుడుపేట - నరసారెడ్డికండ్రిగ జాతీయ రహదారి సమీపంలో మోటారు సైకిల్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణానికి చెందిన సేతం సునీల్, యర్రాబత్తిన సునీల్ మోటారు సైకిల్‌పై శుక్రవారం నెల్లూరు వైపు వెళ్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోటలో ఏసీబీ అధికారుల విచారణ

కోట, ఫిబ్రవరి 9: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ అధికారులు ఒక కేసుకు సంబంధించి విచారణ చేపట్టారు. ఏసీబీ సబ్ ఇన్‌స్పెక్టర్, తహసీల్దారు నాగరాజరావు, డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున్‌రావు సమక్షంలో పలు రికార్డులను పరిశీలించారు. 2013లో కోటలో భూమి ఆక్రమణ విషయమై హైకోర్టులో కేసు నడుస్తోంది. ఆ భూమికి సంబంధించిన వివరాలను ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులను పిలిపించి వివరాలను సేకరించారు. ఈ విచారణ అంతా గోప్యంగా జరిగింది.

నాటుబాంబు పేలి కుక్క మృతి

తడ, ఫిబ్రవరి 9: నాటుబాంబు పేలి కుక్క మృతి చెందింది. తడ కండ్రిగ పంచాయతీ అగ్రహారం వద్ద ఓ కుక్క చెట్లలో నుంచి ఓ చిన్నపాటి బాంబును నోటికి కరుచుకొని ఇళ్ల వద్దకు వచ్చింది. దానిని తినేందుకు ప్రయత్నించగా పేలిపోవడంతో కుక్క మృతి చెందింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అది బాంబు కాదని, టపాకాయ ఉండవచ్చని పోలీసులు చెప్పారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 9: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు చేపడుతామని ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి కిరణ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని క్లస్టర్, ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పిస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలో ఒక్కో క్లస్టర్ అధికారి 10నుంచి 13 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణలను పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు. డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, ఎస్ఈబీ డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ ఓటర్లకు మద్యం పంపిణీ చేయడం వంటి ప్రలోభాలకు పాల్పడితే కఠిన చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో చంద్రముని

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 9: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రిటర్నింగ్ అధికారి చంద్రముని కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన పోలీసు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు పక్కా ప్రణాళికతో పనిచేయాలన్నారు. అనంతరం సత్యసాయి కల్యాణ మండపంలో సూళ్లూరుపేట సబ్‌డివిజన్ అధికారులతో ఎన్నికలు, పోలింగ్ కేంద్రాల వసతులు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై దృష్టి సారించాలన్నారు. ఎన్నికల విధుల్లో అలసత్వం వహించరాదని ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రమౌళి, సీఐ మధుబాబు, ఎస్ఐ రహీంరెడ్డి, ఎన్నికల డీటీ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

12న పెళ్లకూరు మండల మీట్

పెళ్లకూరు, ఫిబ్రవరి 9: పెళ్లకూరు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 12న మండల కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సురేష్ బాబు తెలిపారు. ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు, ఫిబ్రవరి 9: 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గూడూరు పట్టణంలో విద్యుత్ సరఫరా ఉండదని డీఈ ప్రసాద్ శుక్రవారం తెలిపారు.

వెంకటగిరి: పట్టణంలోని 132 కేవీ సబ్‌స్టేషన్, శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరు వద్ద ఉన్న 220 కేవీ సబ్‌స్టేషన్‌లో మర్మమతుల కారణంగా వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో శనివారంఉదయం 8నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ మనిరవి తెలిపారు.

చిల్లకూరు: మండలంలోని చిల్లకూరు, తిప్పగుంటపాళెం, అంకులపాటూరు, చింతవరం, వరగలి సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8నుంచి 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న ఏఈఈ మునిశేఖర్ తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: పాశిం



టీడీపీలో చేరినవారితో పాశిం సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 9: రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలిచి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన పలువురు టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందన్నారు. అరాచకపాలన వల్ల అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. గాడి తప్పిన రాష్ట్రాభివృద్ధిని సరైన బాటలో నడిపించాలంటే చంద్రబాబునాయుడును సీఎంగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, నాగేశ్వరరావు, పెంచలయ్య, రవీంద్రరెడ్డి, రఘురామయ్య, రమణయ్య, ప్రభాకర్‌రెడ్డి, రవి, అనంత్, రత్నయ్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మొలకలపూడిలో భవిష్యత్తుకు గ్యారెంటీ

చిట్టమూరు, ఫిబ్రవరి 9: మండలంలోని మొలకలపూడి గ్రామంలో శుక్రవారం బాబు షూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి భవిష్యత్‌కు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెదనపర్తి రాజగోపాల్‌రెడ్డి, జనార్దనరెడ్డి, కాపులూరు చెంచురామయ్య ఆచారి, నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, గుంపర్ల చిన్నారావు, కల్లూరు మణి, గణపతి, వెంకటరమణయ్య, మురళీధర్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలి: జనసేన



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు

వెంకటగిరి, ఫిబ్రవరి 9: జనసేన అధినేత పవన్ కల్యాణ్ నిర్ణయమే తమకు శిరోధార్యమని, పార్టీ నిర్ణయానికి జనసైనికులు కట్టుబడి పనిచేయాలని ఆ పార్టీ నాయకుడు తోట కృష్ణయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. జనసేన, టీడీపీ పొత్తులో భాగంగా ఎవ్వరికి టికెట్ ఇచ్చినా అభ్యర్థి విజయానికి జనసైనికులు కృషి చేయాలని స్పష్టం చేశారు. ఇటీవల కొందరు జనసేన నేతలు వెంకటగిరి టికెట్ కేటాయింపులో కులసంఘాలకు మద్దతుగా పోరాటం సరికాదన్నారు. పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా నడుచుకొన్నా క్రమశిక్షణా చర్యలకు గురవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అనీల్ రామారావు, చాముండి రాధమ్మ, అరవ రాజేష్, కాలగంద తిరుపాల్, రిజ్వాన్ భాషా, మునిచంద్ర, కలపాటి దుర్గాప్రసాద్, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు, ఫిబ్రవరి 9: స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో శుక్రవారం రోటరీవెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో వేణుగోపాల్ దాతృత్వంతో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. క్లబ్ సీనియర్ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు, నాశిన నాగులు, తాళ్లూరు శ్రీనివాసులు, గిరిబాబు, రవీంద్రరెడ్డి, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

గూడూరు, ఫిబ్రవరి 9: స్థానిక ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం జేవీవీ ఆధ్వర్యంలో సెల్వం దాతృత్వంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు షరీనా, రాజా మాట్లాడుతూ ప్రతినెల క్రమం తప్పకుండా జేవీవీ సంస్థ గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేయడం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచునారాయణ, పురుషోత్తమరావు, నాగరాజు, ప్రభాకర్, విజయబాబు, శ్రీను, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ర్యాలీ

వెంకటగిరి, ఫిబ్రవరి 9: రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురష్కరించుకొని శుక్రవారం బస్టాండ్ నుంచి త్రిభువనీ సెంటర్ వరకు ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

చిట్టేడులో 'పల్లెకు పోదాం'

కోట, ఫిబ్రవరి 9: మండల పరిధిలోని చిట్టేడులో శుక్రవారం బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు సారంగం రమేష్‌బాబు ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటా తిరిగి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను, అభివృద్ధి గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, సురేంద్రనాథ్‌రెడ్డి, అభిలాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం పరిశీలన

బాలాయపల్లి, ఫిబ్రవరి 9: బాలాయపల్లిలోని అంగన్వాడీ కేంద్రాన్ని సీడీపీవో షంషద్‌బేగం శుక్రవారం పరిశీలించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా సంక్షేమ కార్యదర్శి అనూష, కానిస్టేబుల్ నరేంద్ర, కార్యకర్త సుమతి పాల్గొన్నారు.

మొక్కలపాడులో ఎన్ఎస్ఎస్ శిబిరం

వెంకటగిరి, ఫిబ్రవరి 9: వెంకటగిరి మండల పరిధిలోని మొక్కలపాడు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్థానిక విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో పిచ్చిమొక్కలను వలంటీర్లు తొలగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ వెంకటసుబ్బయ్య, మంజునాదరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లారెడ్డి, అధ్యాపకులు మాల్యాద్రి, నారాయణ, నిరుపమా, గోవర్ధన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల డిమాండ్లను పరిష్కరించండి



గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆశావర్కర్ల ధర్నా

గూడూరు, ఫిబ్రవరి 9: ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు స్థానిక టవర్ క్లాక్ సెంటర్ వద్ద నిరసన తెలిపారు. అక్కడ నుంచి ప్రదర్శనగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించాలని ఛలో విజయవాడ కార్యక్రమాన్ని తలపెట్టిన ఆశావర్కర్లను, సీఐటీయూ నాయకులను అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ఆశావర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని, కమ్యూనిటీహెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్చాలని కోరారు. ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్‌లు, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవ్‌లను వర్తింపజేయాలన్నారు. అలాగే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. అనంతరం ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీ రమణయ్య, సురేష్, ప్రసాద్, మణి, చంద్రయ్య, చంగాలమ్మ, జానకి, ఉషా, కృష్ణవేణి పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: కొవిడ్ కాలంలో మరణించిన ఆశా వర్కర్లకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీఐటీయూ నాయకులు లక్ష్మయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీసం వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా మార్చి ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని అందించాలన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆశా కార్మికుల అధ్యక్షురాలు లక్ష్మి, సీఐటీయూ నాయకులు పద్మనాభయ్య, మనోహర్, అల్లెయ్య పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: నాయుడుపేట తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఛలో విజయవాడ కార్యక్రమంలో అరెస్టు చేసిన ఆశావర్కర్ల నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘ జిల్లా కోశాధికారి సుజాత, వర్కర్లు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లలో వసతులు కల్పించండి

చిట్టమూరు, ఫిబ్రవరి 9: మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో అవసరమైన వసతులు కల్పించాలని తహసీల్దార్ శ్రీనివాస శర్మ అన్నారు. శుక్రవారం స్త్రీసంక్షేమ భవనంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. సెక్టార్ అధికారులు, బీఎల్వోలు పోలింగ్ బూత్‌లు తనిఖీ చేసి వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ నిరంజన్‌కుమార్, ఆర్ఐ మధులత, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బాలాయపల్లి, ఫిబ్రవరి 9: మండలంలోని నిడిగల్లు, గాజులపల్లి, పిగిలాం, పిగిలాం కొత్తపాళెం, హస్తకావేరి, పాకపూడి, జయంపు, గొట్టికాడు, మన్నూరు, అలిమిలి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు పుల్లారావు పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో మౌలిక వసతులపై దృష్టి సారించాలని బీఎల్‌వోలకు సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వోల సమావేశం

బాలాయపల్లి, ఫిబ్రవరి 9: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దారు పుల్లారావు బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో సవరణలు జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. రాజకీయాలకు దూరంగా ఎన్నికల సంఘానికి లోబడి పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఆర్ఐ పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న ఇవ్వడం హర్షణీయం

గూడూరు, ఫిబ్రవరి 9: మాజీ ప్రధాని పీవీ నరసింహరావుకు కేంద్రప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించడం హర్షణీయమని ఆదిశంకరాచార్య బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు శుక్రవారం తెలిపారు. దేశ ఆర్థికవ్యవస్థను గాడిలో పెట్టడంతో పాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని సామాన్యులకు అందుబాటులోకి తెచ్చిన మహనీయుడు పీవీ అని కొనియాడారు.

వైభవంగా కలశ మహోత్సవం

వెంకటగిరి, ఫిబ్రవరి 9: వెంకటగిరి పట్టణంలోని బంగారుపేటలో ఉన్న వేణుగోపాలస్వామి దేవస్థానంలో కనకవల్లీ, వేదవల్లీ, సమేత వీరఘవస్వామి మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముగిసిన భక్త సమ్మేళనం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 9: సూళ్లూరుపేటలోని ఎస్‌కేఎస్ కల్యాణ మండపంలో ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అఖిల భారత సాయి మాస్టర్ భక్త సమ్మేళనం శుక్రవారం ముగిసింది. భక్తుల్లో ఆధ్యాత్మికత పెంపొందించేందుకు ప్రవచనాలు ఇచ్చారు. చివరి రోజు వృద్ధులకు నిత్యావసర సరుకులు, దివ్యాంగులకు రూ.2 చొప్పున నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వాహకులు మన్నెముద్దు చంద్రబాబు, శ్రీనివాసులు, ఆలపాటి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

కోట, ఫిబ్రవరి 9: మండల పరిధిలోని చిట్టేడు ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంగన్వాడీ అధికారుల ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కౌమారదశలో వివాహాలు చేసుకుంటే కలిగే నష్టాలను వివరించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను తల్లుల చేత ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ కవిత, వర్కర్లు, హెల్పర్లు సునీత, జయశ్రీ, సుధా, మాధవి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

వాకాడు: మండలంలోని బాలిరెడ్డిపాళెం ఉన్నత పాఠశాలలో బాలికలకు బాల్య వివాహాల నిర్మూలనపై డాక్టర్ కమలశ్రీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు పరిశుభ్రత, పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ బుజ్జమ్మ, అంగన్వాడీ టీచర్లు రమణి, పద్మలీల పాల్గొన్నారు.

నాయుడుపేట తహసీల్దారుగా కల్యాణి

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 9: నాయుడుపేట తహసీల్దారుగా కల్యాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తుళ్లూరు నుంచి బదిలీపై వచ్చిన ఆమెకు రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు.

అన్నదానానికి రూ.2 లక్షల విరాళం

తడ, ఫిబ్రవరి 9: చిన్నమాంబట్టులో వెలసిన కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణాదేవి ఆలయం అన్నదాన ట్రస్టుకు రూ.2 లక్షల విరాళాన్ని దాతలు అందజేశారు. శుక్రవారం త్రై అమావాస్య సందర్భంగా ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. గోపూజ చేశారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. గ్రామానికి చెందిన పాముల రాజయ్య, శకుంతలమ్మ దంపతులు ట్రస్టుకు రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సిమ్స్ వైద్యులు మునస్వామి, హరగోపాలకృష్ణశర్మ, త్రిపుర సుందరి, సుబ్బనరస్సయ్య, శ్రీనివాసులు, ఆలయ చైర్మన్ ముని శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నరసింహ యాదవ్‌కు సన్మానం



నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 9: తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్‌ను ఆ పార్టీ జిల్లా కార్యదర్శిగా వేమసాని శోభన్‌నాయుడు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, గూడూరు సుధీర్‌రెడ్డి, అవధానం సుధీర్, నాగేంద్రనాయుడు పాల్గొన్నారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు

గూడూరు, ఫిబ్రవరి 9: పంట కాలువల ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్‌శాఖ ఏఈ సురేష్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండంలోని చెన్నూరు సమీపంలో కొందరు పంటకాలువలను ఆక్రమించారని ఫిర్యాదు రావడంతో వాటిని పరిశీలించామన్నారు. సర్వే చేయాలని రెవెన్యూ అధికారులను కోరామని, సర్వే అనంతరం ఆక్రమణలు ఉంటే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కాంగ్రెస్ పార్టీని గెలిపించండి

గూడూరు, ఫిబ్రవరి 9: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిమల వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ముత్యాలపేట, వివేకానందరోడ్డు, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వాల విధానాలతో నిత్యావసరాల ధరలు పెరిగిపోయి పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పేదల సంక్షేమానికి కృషిచేసే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు.